Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 334 మేడ్చల్ మల్కాజ్‌గిరి 23 డిసెంబర్ 2023 శనివారం పేజీలు : 4

## న్యూ ఇయర్ వేడుకలపై ఫాం హౌస్‌లకు నిబంధనలు

చెన్నై : నూతన సంవత్సరం వేడుకలు జరుపుకొనే సమయంలో నిబంధనలు ఉల్లంఘించే ఫాం హౌస్‌లు, ప్రైవేటు విడిదుల లైసెన్స్ రద్దు చేయనున్నట్లు పోలీసు శాఖ హెచ్చరికలు జారీచేసింది. స్థానిక ఈసీఆర్ రోడ్డులో అక్కరై, పనయూర్, నైనార్‌కుప్పం, ఉద్దండి, కానాత్తూర్, ముట్టుకాడు వంటి ప్రాంతా ల్లో ఫాం హౌస్‌లు, రిస్టార్ట్‌లున్నాయి. అక్కడ క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలకు ఇప్పటినుంచే ఏర్పాట్లు జరుగుతున్నాయి. అసంభావిత సంఘటనలు అడ్డుకొనేలా పోలీసు శాఖ వేడుకలపై నిబంధనలు విధించింది. ఈ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు చేపట్టనున్నట్లు రిసార్ట్‌లు, ఫాం హౌస్ లైసెన్స్ రద్దు చేయనున్నట్లు హెచ్చరికలు జారీ చేసింది.

# హామీల అమలు దిశగా...


# రేవంత్ సర్కార్ దూకుడు




## పెన్షన్ 4 వేలు, రూ 500కే గ్యాస్ సిలిండర్ అమలు ముహూర్తం ఖరారు..!!

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం గ్యారంటీల అమలుపై వేగంగా అడుగులు వేస్తోంది. ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమల్లో భాగంగా మరో రెండు పథకాల అమలుకు ముహూర్తం నిర్ణయించింది. ఇప్పటికే రెండు పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం..తాజాగా మరో రెండు ప్రారంభం పైన నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవమైన ఈ నెల 28వ తేదీ ఇందుకు ముహూర్తంగా ఖరారు చేసింది. కొత్త సంవత్సరం కానుకగా ఇవి అమల్లోకిరానున్నాయి. హామీల అమలు దిశగా తెలంగాణలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు రేవంత్ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సోనియా గాంధీ జన్మదినం నాడు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం..రూ 10 లక్షలకు ఆరోగ్య శ్రీ పెంపు అమల్లోకి తీసుకొచ్చారు. కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవమైన ఈ నెల 28 నుంచి మరో రెండు పథకాలను ప్రజలకు అందజేయనుంది. తాజాగా తెలంగాణ కాంగ్రెస్ నిర్వహించిన రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలోనూ ఆరు గ్యారెంటీలపై చర్చ జరిగింది. పార్టీ వ్యవస్థాపక దినమైన డిసెంబరు 28 నుంచి పింఛను పెంపు, రూ.500కే గ్యాస్ సిలిండర్ అమలు ప్రక్రియను ప్రారంభించాలని ఇందులో నిర్ణయించారు. భారీ కసరత్తు అవసరం లేకుండా, తక్షణమే ప్రారంభించగలిగే పథకాలు ఏమున్నాయనే అంశంపై గాంధీ భవన్‌లో జరిగిన కాంగ్రెస్ పీఏసీలో చర్చించారు. పెన్షన్ - గ్యాస్ సబ్సిడీ ఈ క్రమంలోనే 'చేయూత'లో భాగంగా నెలవారీ పింఛనును రూ.4 వేలకు పెంచి ఇవ్వాలన్నదానిపై ఏకాభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా పింఛను తీసుకుంటున్న లబ్ధిదారుల లెక్కలు కూడా సిద్ధంగా ఉన్నాయి. ప్రతి నెల 45 లక్షల పైగా బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ జరుగుతోంది. వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, హెచ్ఐవీ, బోదకాలు బాధితులకు ప్రస్తుతం ఆసరా పింఛను కింద నెలకు రూ.2,016 చొప్పున ఇస్తున్నా రు. ఇకపై ఇది రూ.4 వేలు కానుంది. ఇప్పటివరకు నెలకు రూ.900 కోట్ల వరకు ఖర్చవుతుండగా.. పెరిగే పింఛను మొత్తంతో ఇది రెట్టింపయ్యే అవకాశం ఉంది. నెలకు రూ.1,800 కోట్లు చొప్పున ఏటా రూ.21,600 కోట్లకు చేరనుంది. కాగా, వికలాంగులకు రూ.3,016 పింఛను ఇస్తున్నారు. దీనిని పెంచే విషయమై రెండు, మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తండ్రికి అంత్యక్రియలు చేసిన కూతుళ్లు. ఈ నెల 28 నుంచి అమలు ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే ఇస్తామని ఆరు హామీల్లో పేర్కొంది. సిలిండర్ ధర రూ.955 ఉండగా.. ప్రభుత్వం రూ.455 సబ్సిడీ భరించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 1.20 కోట్ల వంట గ్యాస్ కనెక్షన్లున్నాయి. ఇందులో దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) 89.99 లక్షల మంది ఉన్నారు. వీరికి ఏడాదికి 6 సిలిండర్లకు రాయితీ ఇస్తే ప్రభుత్వంపై రూ.2,225 కోట్ల ఆర్థిక భారం పడుతుంది. 12 సిలిండర్లు ఇస్తే అది రూ.4,450 కోట్లవుతుంది. కాగా, కేంద్ర ప్రభుత్వం ఒక్కో సిలిండర్‌పై రూ.40 సబ్సిడీ ఇస్తోంది. మొత్తం డబ్బు చెల్లించి తీసుకున్న తర్వాత ఆ రాయితీని బ్యాంకు ఖాతాలో జమ చేస్తోంది. ఈ రెండు పథకాల అమలు పైన ప్రభుత్వం అధికారికంగా విధి విధానాల పై ప్రకటన చేయనుంది.

## మార్చి చివరకు 'టోల్' స్వరూపమే మారిపోనుందా?




హైదరాబాద్ : ఇంటి నుంచి రోడ్డు మీదకు వచ్చి.. దూర ప్రాంతాలకు వెళ్లాలనుకునే వారు ఎవరైనా.. నగరాల్లో నివాసం ఉండే వారికి తరచూ ఎదరయ్యే 'టోల్' వ్యవహారం గురించి తెలిసిందే. కేంద్రం తీసుకొచ్చిన ఫాస్ట్ టాగ్ కారణంగా గతంలో పోలిస్తే.. ఇప్పుడు వాహనాల్ని టోల్ గేట్ల వద్ద నిలిపి ఉంచే టైం తగ్గింది. అయితే.. పూర్తిగా తగ్గలేదన్నది నిజం. పండుగలు.. పర్వదినాలు.. ప్రత్యేక సమయాల్లో వాహన రద్దీ ఎక్కువగా ఉంటే.. ఇప్పటికి టోల్ దగ్గర వెయిట్ చేసే పరిస్థితి. అయితే.. ఇలాంటి సమస్య వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి మొత్తంగా మారిపోనుంది. దీనికి కారణం.. టోల్ వసూలు చేసే పద్దతి మొత్తంలోనూ మార్పు రావటమే. వచ్చే మార్చి చివరి నాటికి జీపీఎస్ ఆధారిత టోల్ వసూలు వ్యవస్థలతో పాటు సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తీసుకురానున్నారు. దీంతో.. టోల్ గేట్ల దగ్గర ఇప్పుడున్న విధానంలో మార్పు రానుంది. ఈ విషయాన్ని తాజాగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణ కోసం కొత్త విధానాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. టోల్ గేట్ల వద్ద తరచూ ఏర్పడే సమస్యల్లో ముఖ్యమైనది.. ఎక్కువ సేపు వెయిట్ చేయాల్సి రావటం.. కచ్చితమైన ఛార్జీలను వసూలు చేసే అంశంపై ఫిర్యాదులు అందుతుంటాయి. టోల్ సిబ్బంది దురుసు ప్రవర్తన కూడా పలుమార్లు చర్చకు వస్తుంటుంది. త్వరలో అందుబాటులోకి వచ్చే సరికొత్త సాంకేతకత పుణ్యమా అని.. టోల్ వ్యవస్థ స్వరూపమే మారిపోనుంది. ప్రస్తుతం ఉన్న టోల్ ప్లాజాల స్థానంలో జీపీఎస్ ఆధారిత టోల్ వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. దీంతో.. వాహనాలకు విధించే టోల్ ఛార్జీల్లో కచ్చితత్వం కూడా పెరగనుంది. ఒక అంచనా ప్రకారం 2018-19 లో టోల్ ప్లాజాల వద్ద వాహనదారులు వెయిట్ చేసే సమయం సగటున 8 నిమిషాలు. తర్వాతి కాలంలో తీసుకొచ్చిన మార్పుల కారణంగా ఇది కాస్తా 47 సెకన్లకు తగ్గింది. మరో మూడునెలల్లో అందుబాటులోకి వస్తే సరికొత్త సాంకేతికత కారణంగా.. టోల్ ప్లాజా వద్ద వెయిట్ చేయాల్సిన అవసరం ఉండదు. ప్లాజాల వద్ద ఏర్పాటు చేసే అత్యాధునిక స్కానింగ్ వ్యవస్థతో.. వాహనం నెంబరును నోట్ చేసుకొని.. రియల్ టైంలో వసూళ్లను అప్పటికప్పుడు పూర్తి చేస్తారు. ఈ క్రమంలో ఫాస్టాగ్ కీలక భూమిక పోషిస్తుందని చెబుతున్నారు.



## గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు!

దిల్లీ: 2024 గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానియేల్ మెక్రాన్‌ను ఆహ్వానించినట్లు కేంద్ర అధికారిక వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. అంతకుముందు ఈ వేడుకలకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ను ఆహ్వానించినట్లు భారత్‌లోని అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి వెల్లడించారు. అయితే, వివిధ కారణాల వల్ల ఈ కార్యక్రమానికి హాజరుకాలేనని బైడెన్ చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్ అధ్యక్షుడిని ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జులైలో పారిస్‌లో జరిగిన ఫ్రాన్స్ జాతీయ దినోత్సవ బాస్టిల్ డే పరేడ్‌లో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగతి తెలిసిందే. మరోవైపు ఈ ఏడాది సెప్టెంబరులో భారత్ వేదికగా దిల్లీలో జరిగిన జీ20 సదస్సులో ఇమ్మానియేల్ మెక్రాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెక్రాన్ మాట్లాడుతూ.. భారత్-ఫ్రాన్స్ సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రధాని మోదీతో చర్చలు జరిగాయని తెలిపారు. బాస్టిల్ డే పరేడ్‌కు మోదీ హాజరుకావడాన్ని తమ దేశ ప్రజలు గౌరవంగా భావించారని పేర్కొన్నారు. గత ఏడాది గణతంత్ర వేడుకలకు ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్‌సీసీ ముఖ్య అతిథిగా హాజరైన విషయం తెలిసిందే.



# బీఆర్ఎస్‌లో జంప్ జలానీలు

## చేజారకుండా ఫోకస్ పెట్టిన కారు సారు

హైదరాబాద్ : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన బీఆర్ఎస్ నేతల్లో భయం పట్టుకుంది. గతంలో కాంగ్రెస్ వారిని బీఆర్ఎస్ నేతలు ఆకర్షించినట్లే ఇప్పుడు సీన్ రివర్స్‌గా మారింది. పలువురు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ వారితో టచ్ లో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో కేసీఆర్ జాగ్రత్త పడుతున్నారు. తమ పార్టీకి ఏదో ముప్పు వాటిల్లుతుందనే బెంగ పట్టుకుంది. ఈనేపథ్యంలో పార్టీ మారే వారిని గుర్తించి వారితో ప్రత్యేకంగా సమావేశం అవుతున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఘోర పరాభవం తరువాత కొందరు ఎంపీలు కాంగ్రెస్ నేతలతో మాట్లాడుతున్నట్లు సమాచారం. దీంతో నలుగురు ఎంపీలు కాంగ్రెస్ వారితో మాట్లాడుతున్నట్లు కేసీఆర్ కు తెలియడంతో వారిని పార్టీని వీడకుండా చర్యలు చేపడుతున్నారు. వారిని తక్షణమే ఢిల్లీ నుంచి వచ్చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. పార్టీ మారకుండా చూడాలని ప్రయత్నిస్తున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ మెదక్ నుంచి పోటీ చేస్తారనే భావిస్తున్నారు. మెదక్ స్థానంపై పలువురికి గురి ఉండటంతో రాజకీయం రసవత్తరంగా మారనుంది. కాంగ్రెస్ నుంచి విజయశాంతి, బీజేపీ నుంచి ఈటల రాజేందర్, కెప్టెన్ విజయరఘునందన్ రావులు బరిలో నిలవాలని చూస్తున్నాట్లు సమాచారం. మొత్తానికి మెదక్ రాజకీయం అందరిలో ఆసక్తి రేపుతోంది. బీఆర్ఎస్ ఎంపీలు జంపు జలానీలుగా మారతారనే వార్త కేసీఆర్ మనసులో కలవరం పెంచుతోంది. లోక్ సభ ఎన్నికల కోసం వ్యూహాలు ఖరారు చేస్తున్నట్లు చెబుతున్నారు. గెలుపు గుర్రాల కోసం కసరత్తు చేస్తున్నారని తెలుస్తోంది. దీని కోసమే సమర్థులైన వారి కోసం పార్టీలు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. కాంగ్రెస్ కూడా పట్టు నిలుపుకోవాలని చూస్తోంది. ఇదివరకు ఉన్న ఎంపీల స్థానంలో కొత్త వారిని నిలబెట్టాలనే ఆలోచనలో కేసీఆర్ ఉన్నారని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. పార్టీలోని కొందరు ఎంపీలు కాంగ్రెస్ తో రాయబారాలు సాగిస్తున్నట్లు చెబుతున్నారు. వారు కాంగ్రెస్ లోకి వెళితే పరువు పోతుందనే వాదనలు కూడా వస్తున్నాయి. గతంలో వారు చేసిన పాపమే ఇప్పుడు వారిని వెంటాడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవానికి గల కారణాలు తెలుసుకుని మళ్లీ అలాంటి పొరపాట్లు చేయకుండా జాగ్రత్త పడాలని కేసీఆర్ భావిస్తున్నారు.

# సంపాదకీయం

## ఐరన్ డోం అంటే ఏమిటి... దాన్ని ఎలా ధ్వంసం చేశారు?

గాజాలో హమాస్ ఉగ్రవాదుల నెట్ వర్క్ ను అంతం చేయడమే లక్ష్యంగా ఇజ్రాయేల్ సైన్యం దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో హమాస్ కు మద్దతుగా లెబనాన్ లోని మిలిటెంట్ సంస్థ హెజ్ బొల్లా.. ఇజ్రాయేల్ పై ఎదురుదాడులు చేస్తుంది. హమాస్ పై దాడులు ఆపని పక్షంలో తమ ఎంట్రీ తప్పదని ముందుగా హెచ్చరించినట్లుగా ఆ పనికి పూనుకుంది. ఈ సమయంలో ఇజ్రాయేల్ కలిగి ఉన్న అత్యంత దుర్భేద్యమైన ఐరన్ డోం వ్యవస్థపై ఈ సంస్థ దాడి చేసిందని.. దీంతో ఆ వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలుస్తుంది. అవును... ఇజ్రాయేల్ కి ఉన్న ప్రపంచంలోనే అత్యుత్తమ గగనతల రక్షణ వ్యవస్థల్లో ఒకటైన ఐరన్ డోం వ్యవస్థకు ప్రమాదం జరిగిందని తెలుస్తుంది. ఇందులో భాగంగా... ఉత్తర ఇజ్రాయెల్ లోని రెండు ఐరన్ డోం వ్యవస్థలపై దాడి చేసినట్లు హెజ్ బొల్లా సంస్థ ప్రకటించుకుంది. ఇదే సమయంలో తాము ఐరన్ డోం పై చేసిన దాడిలో రెండు లాంచింగ్ ప్లాట్ ఫాంలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపింది. దీంతో ఇజ్రాయేల్ గతనతలంలో ఉన్న అత్యంత దుర్భేద్యమైన వ్యవస్థ ధ్వంసం అవుతుందనే చర్చ మొదలైంది. ఇది ఇజ్రాయేల్ కు తీవ్ర నష్టం కిందే లెక్క. అయితే... ఐరన్ డోం పై దాడులు చేసి లాంచింగ్ ప్లాట్ ఫాం లను ధ్వంసం చేసినట్లు హెజ్ బొల్లా చేసిన ప్రకటనపై ఇజ్రాయెల్ సైన్యం స్పందించలేదు. కానీ... ఈ మిలిటెంట్ గ్రూప్ ను లక్ష్యంగా చేసుకుని దక్షిణ లెబనాన్ పై ఇజ్రాయెల్ క్షిపణి దాడులు చేసినట్లు తెలుస్తుంది. దీంతో ఇప్పుడు ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దుల్లో కూడా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ మొదలైన దాడుల్లో ఇప్పటివరకూ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని తెలుస్తున్నప్పటికీ... ఇజ్రాయేల్ – హెజ్ బొల్లా ల పోరు పెను ప్రమాదాలకు కారణమవ్వొచ్చనే కామెంట్లు మాత్రం వినిపిస్తున్నాయి. కాగా ఈ ఏడాది అక్టోబరు 7న హమాస్ ఉగ్రవాదుల మెరుపు దాడుల నేపథ్యంలో.. అందుకు ప్రతీకారంగా నాటి నుంచి గాజాపై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఇజ్రాయేల్ సైన్యం గాజాను అష్ట దిగ్బంధం చేయడంతో.. స్థానికంగా నీళ్ళ, ఆహారం, ఔషధాలు, ఇంధనం కొరత నెలకొంది. ఈ సమయంలో హమాస్ కు మద్దతుగా ఇప్పుడు హెజ్ బొల్లా కూడా ఎంటరై.. ఏకంగా ఐరన్ డోం నే ధ్వంసం చేయడం గమనార్హం.

**ఐరన్ డోం వ్యవస్థ అంటే ఏమిటి..?:** ఐరన్ డోం అనేది ప్రపంచంలోనే అత్యుత్తమ గగనతల రక్షణ వ్యవస్థల్లో ఒకటి. ఇజ్రాయెల్ కు చెందిన రఫేల్ సంస్థ దీన్ని అభివృద్ధి చేయగా... అందుకు అమెరికా తోడ్పాటు అందించింది. శత్రువులు ప్రయోగించే రాకెట్లను దీనిలోని డిటెక్షన్ అండ్ ట్రాకింగ్ రాడార్ పసిగట్టి.. ఆ రాకెట్ గమనానికి సంబంధించిన సమాచారాన్ని ఆయుధ నియంత్రణ వ్యవస్థకు చేరవేయడం దీని పని. దీంతో ఆ వ్యవస్థ.. రాకెట్ దిశగా క్షిపణిని ప్రయోగించి దాన్ని గాల్లోనే ధ్వంసం చేస్తుంది. కాగా... ఇజ్రాయేల్ దేశం ఈ దుర్భేద్యమైన రక్షణ వ్యవస్థ ఐరన్ డోం ను 2011 నుంచి వినియోగంలోకి తీసుకొచ్చింది. అందుకు కారణం... 2006లో జరిగిన లెబనాన్ ఘర్షణల సమయంలో హెజ్ బొల్లా సంస్థ... ఇజ్రాయెల్ పై వేల రాకెట్లతో విరుచుకుపడటమే. ఈ దాడుల్లో అనేకమంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఇలాంటి దాడులను తిప్పికొట్టడానికి గగనతల రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఇజ్రాయెల్ నిర్ణయించింది! ఆ నిర్ణయ ఫలితమే ఐరన్ డోం వ్యవస్థ!

# సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ పానెల్ అడ్వైజర్ మెంబర్గా బుద్ధి శ్రీనివాస్ నియామకం

### ప్రతి కార్యకర్త కృషిని గుర్తించటం బిజెపి పార్టీకే సాద్యం బుద్ధి శ్రీనివాస్



శామీర్ పేట (గరుడ వార్త) : ప్రతి కార్యకర్త కృషిని గుర్తించటం బిజెపి పార్టీకే సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుద్ధి శ్రీనివాస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని సెంట్రల్ ఫిలీం బోర్డ్ అడ్వయిజరి ఫ్యానెల్ నూతన సభ్యునిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుద్ధి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ హైదరాబాద్ రీజినల్ అధికారి శిపాలి కుమార్ ఉత్తర్వులు జారి చేసారు. పదవిలో బుద్ధి శ్రీనివాస్ రెండేళ్ళ పాటు కొనసాగనున్నట్లు సెంట్రల్ ఫిలీం బోర్డ్ ఉత్తరువులో పేర్కొన్నారు. బీజేపీ పార్టీలో తాను చేస్తున్న సేవలను గుర్తించి పార్టీ అధిస్థానం కేంద్ర ప్రభుత్వంలోని సెంట్రల్ ఫిలీం బోర్డ్ సభ్యునిగా నియమించడం పట్ల బుద్ధి శ్రీనివాస్ ను పార్టీ నాయకులకు, సంబంధిత అధికారులకు కృతజ్ఞతలను తెలిపారు. హైదరాబాద్ లోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ అధికారులకు కృతజ్ఞతలను తెలిపారు. సెంట్రల్ ఫిలీం బోర్డ్ కార్యాలయంలో త్వరలోనే తాను పదవి బాధ్యతలను చేపడుతానని శ్రీనివాస్ తెలిపారు. కార్యకర్త స్థాయి నుంచి కేంద్ర పదవి దాక ఎదగడం వెనుక బుద్ధి శ్రీనివాస్ 30 ఏళ్ళుగా పార్టీ కొరకు పాటుపడ్డ కృషి ఉందనే చెప్పాలి. భారతీయ జనతా పార్టీలోనే కొనసాగుతు పార్టీలో ఉత్తమ సేవలందిస్తు కార్యకర్త స్థాయి నుంచి పదవిని పొందే స్థాయి వరకు ఇంతింతైై, వటుడింతైగా ఎదుగుతున్న బుద్ధి శ్రీనివాస్ పై అభినందనలు వెల్లువెత్తాయి. కాగా ప్రస్తుతం బుద్ధి శ్రీనివాస్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యునిగా, జగ్గంగూడ గ్రామ ఉపసర్పంచ్ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఎటువంటి సిఫారసులు, దరఖాస్తులు లేకుండా తన కృషిని గుర్తించి తనను పానెల్ అడ్వైజర్ మెంబెర్ గా నియమించినందుకు సంబంధిత పెద్దలందరికీ ధన్యవాదాలు తెలిపారు. తనకిచ్చిన పదవిని బాధ్యతాయుతంగా నిర్వర్తించి, సదరు పదవికి మరింత వన్నె తెచ్చే విధంగా కృషి చేస్తానంటూ బుద్ధి శ్రీనివాస్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు

### 272 కిలోల గంజాయి రెండు ఫోర్ వీలర్లు 7 సెల్ ఫోన్లు తోపాటు ఆరుగురిని అరెస్ట్





విద్యార్థులు మత్తుకు బానిసలు కాకండ, తల్లితండ్రులు మరింత అప్రమత్తత అవసరం మేడ్చల్ డిసిపి శబరీష్ గుట్టు చప్పుడు కాకుండా గ్రాములు కాదు కిలోలు కాదు ఏకంగా క్వింటాళ్లలో గంజాయిని తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పట్టుకున్న మేడ్చల్ జోన్ ఎస్ఓటి బృందంతోపాటుగా షామీర్పేట పోలీసులను మేడ్చల్ డిసిపి శబరిష్ అభినందించారు. శుక్రవారం పెట్ బషీరాబాద్ ఏసీపీ కార్యాలయంలో, డీసీబీ శబరీష్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గురువారం రాత్రి గంజాయి తరలిస్తున్నారు అన్న సమాచారం అందడంతో పోలీసులు వారార్ టోల్గేట్ సమీపంలో వాహనాల తనకి నిర్వహించగా అందులో టవేరా బలేనో వాహనాల్లో 272 కేజీల ఎండు గంజాయిని తరలిస్తుండగా, గంజాయి స్మగ్లర్లను పట్టుకున్నట్లుగా డీసీపీ తెలిపారు. ఇక ఇంత పెద్ద మొత్తంలో గంజాయిని ఒరిస్సా రాష్ట్రం నుండి హైదరాబాద్ మీదుగా పూణేకు తరలిస్తున్నారని డిసిపి తెలిపారు వీరి వద్ద నుండి రెండు ఫోర్ వీలర్ వాహనాలు, ఏడు సెల్ ఫోన్లు తో పాటుగా, నిందితులను అదుపులో తీసుకున్నట్లుగా డీసీపీ వెల్లడించారు. ఇక రెండు పట్టుకున్న గంజాయి విలువ సుమారు 80 లక్షల రూపాయల మేర విలువ ఉంటుందని పోలీసులు తెలిపారు. కాగా మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు విద్యార్థులు మత్తు పదాలు బానిస కావద్దని డిసిపి కోరారు అంతేకాకుండా ముఖ్యంగా తల్లిదండ్రులు కూడా విద్యార్థులపై మరింత శ్రద్ధ అప్రమత్తత ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తు చేశారు

# అధ్వానంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



కన్నాయిగూడెం : ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం పడకేసింది. వ్యాధులబారిన పడి ఆసుపత్రికి వచ్చే వారికి అపరిశుభ్ర వాతావరణం దర్శనమిస్తోంది. ములుగు జిల్లా కన్నాయిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహణ అధ్వానంగా మారింది. ఒక వైపు సీజనల్ వ్యాధులతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతుండగా, వైద్య సేవల కోసం ఇక్కడికి వచ్చాక తమకు కొత్తగా వ్యాధులు సోకుతాయనే భావన రోగుల్లో కనిపిస్తున్న సందర్భాలు అనేకం. పీహెచ్సీ ఆవరణ మొత్తం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఆసుపత్రి ఆవరణలో చిన్నపాటి చెరువును తలపించే విధంగా వర్షం నీరు నిల్వడంతో.. దోమలకు నిలయంగా మారింది. ఇక్కడ పనిచేస్తున్న గుత్తేదారు వర్షం నీరు వెళ్లకుండా మట్టిపోయడంతో.. ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధిత అధికారులు, సిబ్బంది ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రజలకేనా ఆరోగ్య సూత్రాలు

ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సాధారణంగా ప్రతి డ్రైడేగా పాటిస్తూ.. ఆయా ప్రాంతాల్లో ఇళ్లల్లో నిల్వ ఉన్న నీటిని పారబోస్తుంటారు. అలా ప్రజలకు ఆరోగ్య సూత్రాలు చెబుతున్న ఆరోగ్య అధికారులు.. ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో నిల్వ నీటికి చర్యలు చేపట్టడం లేదు. పీహెచ్సీలో డ్రైడే, స్వచ్ఛభారత్ కార్యక్రమాలను నిర్వహించడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పీహెచ్సీ నిర్వహణకు ఏటా ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుండగా, వాటితో ఏం చేస్తున్నారో తెలియడం లేదు.

పెరుగుతున్న రోగుల తాకిడి..

రోజురోజుకు ఆసుపత్రికి రోగుల తాకిడి పెరుగుతోంది. గత మూడేళ్ల క్రితం అప్పటి కలెక్టర్, ఇప్పటి ఐటీడీఏ పీవో అంకిత్ పీహెచ్సీకి కావాల్సిన పరికరాలు, సౌకర్యాల ఏర్పాటుకు నిధులను మంజూరు చేశారు. దీంతో కన్నాయిగూడెం పీహెచ్సీలో వైద్యసేవల నాణ్యత పెరిగింది. ఆసుపత్రికి ఎక్కువ విస్తీర్ణం కల్గిన భవనం, రోగుల అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని నియమిస్తే మరింత మెరుగైన సేవలు ప్రజలు పొందగల్గుతారు. ఏదైనా అత్యవసరమైతే ఇక్కడి ప్రజలు ఏటూరునాగారం, వరంగల్ వెళ్లాల్సి వస్తుంది. ఈ క్రమంలో పీహెచ్సీని మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# అరరే ఆలస్యంగా వచ్చాయే!

ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని క్రీడా ప్రాంగణాలకు ప్రభుత్వం సెప్టెంబరు నెల నుంచి క్రీడా సామగ్రి అందించే ప్రక్రియ ప్రారంభించింది. ఇవి దశలవారీగా జిల్లాకు చేరాయి. అయితే క్రీడా సామగ్రి చే రిన రెండు రోజులకే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాటిని పూర్తిగా పంపిణీ చేసే అవకాశం లేకపోయింది. చివరి దశలో సామగ్రి ఉభయ జిల్లాల్లోని యువజన క్రీడల శాఖల పర్యవేక్షణలోనే ఉండిపోయాయి. ఖమ్మం జిల్లాలో 110, భద్రాద్రి జిల్లాలో 350 క్రీడా కిట్లు ఆయా కార్యాలయాల్లో ఉన్నాయి.

ఒక్కో కిట్‌లో... ఒక్కో క్రీడా ప్రాంగణానికి అందించేందుకు సిద్ధం



చేసిన సామగ్రిలో క్రికెట్ కిట్, వాలీబాల్ కిట్, డంబెల్స్, అథ్లెటిక్స్ సాధన సామగ్రి ఉంది. యూనిట్ ఖరీదు రూ.36 వేల వరకు ఉంటుంది. ఆలస్యంగా వచ్చిన క్రీడా సామగ్రిని ఇప్పుడు భద్రపర్చడం సవాలుగా మారుతోంది. ఖమ్మం స్టేడియంలో ఎలుకల బెడద ఎక్కువ. దీంతో సామగ్రి ఎంత సురక్షితంగా ఉంటాయో అనే ఆందోళన ఉద్యోగుల్లో ఉంది. కొత్తగూడెం జిల్లాకు ఆలస్యంగా వచ్చిన సామగ్రిని పాల్వంచ మినీ స్టేడియంలో భద్రపరిచారు.బాగాలేవా... చివరి విడతలో వచ్చిన సామగ్రిలో క్రికెట్ బ్యాట్లు, వాలీబాల్ బంతులు, ఇతరాలు నాసిరకంగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఖమ్మం జిల్లాకు ఇప్పటికే 606 స్పోర్ట్స్ కిట్లు, 45,450 క్రీడా దుస్తులు అందినట్టు లెక్కలు చెబుతున్నాయి. వచ్చిన సామగ్రిని వచ్చినట్టే ఎంపిక చేసిన కేంద్రాలను బట్టి అక్కడి ఎంపీడీఓ కార్యాలయానికి అప్పగించారు. తొలి విడత సామగ్రికి ఇప్పుడు అందిన వాటికి పొంతన లేదని నాసిరకం సామగ్రి అంటగట్టారనే చర్చ ఆ శాఖలో ఉంది.

# రూ.లక్షలు వెచ్చించారు.. నిర్వహణ మరిచారు

జమ్మికుంట: రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లు (ప్రజా మరుగు దొడ్లు) రెండేళ్లుగా నిర్వహణ లేక మూత పడి ఉంటున్నాయి. పుర అధికారుల పర్యవేక్షణ కొరవడి రూ.60 లక్షల వ్యయంతో అన్ని హంగులతో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లతో ఫలితం లేకుండా పోతోంది. దీనికితోడు జన సంచారం లేని స్థలాలలో మరుగుదొడ్లను నిర్మించటంతో ప్రయోజనం లేదని స్థానికులు అంటున్నారు.

జన సంచారం లేని చోట నిర్మాణం..!

జమ్మికుంట పుర పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్రజా మరుగుదొడ్లు, మూత్రశాలలు, సాన్నపు గదులను అన్ని హంగులతో నిర్మించారు. జమ్మికుంట బస్టాండ్ సమీపంలోని వాటర్ ట్యాంక్, నాయిన్‌చెరువు, మండల ప్రజా పరిషత్తు కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు రోడ్డు వద్ద, కొత్తపల్లి ఆర్వోబీ వంతెన కింద రెండేళ్ల క్రితం నిర్మించారు. ప్రజా మరుగుదొడ్ల ముందు భాగాన దుకాణాలను నిర్వహిస్తుండటంతో అవి కనిపించడం లేదని పలువురు వాపోతున్నారు. స్థానిక ప్రజా పరిషత్తు కార్యాలయం ముందు, జన సంచారం లేని నాయిన్ చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్‌కు తాళం వేసి ఉంటుందని స్థానికులు అంటున్నారు. స్థానిక పుర పరిధి కొత్తపల్లి ఆర్వోబీ వంతెన కింద నిర్మించిన పబ్లిక్ టాయిలెట్ల ప్రారంభోత్సవం అనంతరం తెరుచుకోలేదని కొత్తపల్లి వాసులు అంటున్నారు. వాటి నిర్వహణకు పుర అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు అంటున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

జమ్మికుంటలోని పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం. వాటి నిర్మాణానికి స్థలాల ఎంపికలో సరైన నిర్ణయం తీసుకోకపోవడంతోనే ఇబ్బందులు తప్పటం లేదు. నిర్వహణకు విధించిన నిబంధనలు పరిశీలించి గుత్తేదారు రోజూ నిర్వహణ చేసేలా చేస్తాం.బి.శ్రీనివాస్, కమిషనర్, పురపాలక సంఘం, జమ్మికుంట

# చేప పిల్లల పంపిణీలో జాప్యం

మంచిర్యాల : జిల్లాలోని చెరువులు, జలాశయాల్లో చేపపిల్లలను పెంచే పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. వానాకాలం ప్రారంభంలో పిల్లలను వేయాల్సి ఉండగా సీజన్ ముగింపు దశకు చేరినప్పటికీ ప్రక్రియను ముగించకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. పిల్లలను సకాలంలో చెరువుల్లో వేయకపోవడం వల్ల వేసవి నాటికి ఇబ్బందులు ఎదురవుతాయని మత్స్యకారులు పేర్కొంటున్నారు. ఏటా జులై నుంచి సెప్టెంబరు నెలాఖరు నాటికి చేపపిల్లలను తరలించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో నేటికి పూర్తిస్థాయిలో చేప పిల్లలను వేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. నత్తనడకన కొనసాగుతున్న చేపపిల్లల పంపిణీపై కథనం.

మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా చేపల ఎగుమతులు పెంచాలనే లక్ష్యంతో రూపొందించిన చేపల పెంపకం పథకం కొంత మంది అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతుంది. జిల్లాలో ఈ ఏడాది సకాలంలోనే విస్తారంగా వర్షాలు కురిసి అనేక చెరువులు, రిజర్వాయర్లు, ప్రాజెక్టులు నీటితో నిండినప్పటికీ మత్స్యశాఖ అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో పిల్లల పెంపకం పనుల్లో జాప్యం ఏర్పడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జులై నుంచి సెప్టెంబరు నెలాఖరు నాటికి చేపపిల్లల విత్తనాలను చెరువుల్లో వదలాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యంతో నేటికి చేపపిల్లలను చెరువులు, జలాశయాల్లో వదిలే పనులు పూర్తి చేయక పోవడంపై మత్స్యకారులు మండిపడుతున్నారు. చేపపిల్లలను సకాలంలో వేస్తేనే వేసవి నాటికి తగినంత బరువు పెరుగుతాయని లేనిపక్షంలో వాటిలో ఎదుగుదల లోపిస్తుందని మత్స్యకారులు వాపోతున్నారు. ఎదుగుదల సరిగా లేకపోవడంతో పాటు వేసవిలో పలు చెరువుల్లో నీటి కొరత ఏర్పడుతున్న కారణంగా తప్పనిసరి పరిస్థితుల్లో పట్టుకొని విక్రయించాల్సి వస్తుందంటున్నారు.ప్రభుత్వ సహకారంతో వేమనపల్లి, కరీంనగర్‌లోని వీణవంక, చెన్నూరు ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెంచిన చేప పిల్లలను కొనుగోలు చేసి స్థానిక చెరువుల్లో పెంచేందుకు పంపిణీ చేస్తున్నారు. వేసవి నాటికి ఎదుగుదల సరిగా లేకపోవడంతో మత్స్యకారులు సరైన ఆదాయం పొందలేకపోతున్నారు. ఒక్కో చేప కనీసం కిలో మేరకు ఎదిగితే మత్స్యకారులకు మేలు కలుగుతుందని వాపోతున్నారు. పంపిణీలో జాప్యంపై మత్స్యశాఖ అధికారులను వివరణ కోరగా ఈ ఏడాది వర్షాలు భారీగా కురవడంతో అనేక చెరువులు, రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో నీటి వరద కొనసాగిందన్నారు. వరదలో పిల్లలు కొట్టుకుపోయే అవకాశం ఉండటంతో పంపిణీ చేయలేకపోయామన్నారు. ఈ నెలాఖరు నాటికి ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

# సమస్యలు అనేకం.. పరిష్కారం గగనం

గోదావరిఖని : సింగరేణి కార్మికులను సుదీర్ఘ కాలంగా సమస్యలు వెంటాడుతున్నాయి. వాటిని పరిష్కరించడంలో కార్మిక సంఘాలు దృష్టి సారించలేదు. సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల ఆర్థిక ప్రయోజనాలతో పాటు పదోన్నతులకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కాక ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారు. ఆదాయపు పన్ను విషయంలో కోల్ ఇండియా మాదిరిగా సింగరేణిలో అమలు చేయించలేకపోతున్నారు. ప్రభుత్వం, యాజమాన్యాలపై ఒత్తిడి తెచ్చి పరిష్కరించాల్సిన సమస్యలను గాలికి వదిలేయడంతో కార్మికులు నష్టపోతున్నారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ సారైనా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కార్మిక సంఘాలు చొరవ చూపాలని కోరుతున్నారు.
అమలు కాని పెంపు బొగ్గు గని కార్మికులకు గ్రాట్యుటీ పెంచినప్పటికీ కొంత మంది కార్మికులకు వర్తించలేదు. రూ. 10 లక్షలున్న గ్రాట్యుటీని రూ.20 లక్షలకు పెంచారు. ఉద్యోగ విరమణ పొందిన కార్మికునికి రూ. 20 లక్షల గ్రాట్యుటీ మించకుండా వర్తింప చేయాలని నిర్ణయించారు. దీనిపై పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టారు. గని కార్మికులకు 2017, ఫిబ్రవరి నుంచి పెరిగిన గ్రాట్యుటీని అమలు



చేయాలని నిర్ణయించారు. కార్మికులకు 2016, జనవరి నుంచి అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులకు ఇదే తేది నుంచి రూ. 20 లక్షల గ్రాట్యుటీ అమలు చేస్తున్నారు. కార్మికులకు కూడా అదే తేదీ నుంచి వర్తింప చేయాలన్న డిమాండ్ ఇప్పటి వరకు పరిష్కారానికి నోచుకోలేదు. 2016, జనవరి నుంచి 2017, ఫిబ్రవరి మధ్య కాలంలో ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు పెంచిన గ్రాట్యుటీని నష్టపోయారు. ఈ 13 నెలల కాలంలో ఉద్యోగ విరమణ పొందిన వారికి కేవలం రూ. 10 లక్షలు మాత్రమే చెల్లించారు. ఈ వ్యవధిలో సింగరేణి వ్యాప్తంగా 3000 మంది వరకు ఉద్యోగ విరమణ పొందారు. వీరంతా రూ. 10 లక్షల గ్రాట్యుటీ డబ్బులు నష్టపోయారు. వీటిని విశ్రాంత కార్మికు లకు వర్తింప చేయాలని డిమాండ్ చేస్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదు.
ఆదాయపు పన్ను మినహాయింపు ఏదీ?
సింగరేణిలో ఆర్థిక ప్రయోజనాలపై వర్తింప చేస్తున్న ఆదాయపు పన్ను భారం నుంచి కార్మికులు విముక్తి కావడం లేదు. కోల్ ఇండియా కార్మికులకు మాత్రం అక్కడి యాజమాన్యాలు ప్రయోజనాలపై పడే ఆదాయపు పన్నును వారే భరిస్తున్నారు. సింగరేణిలో అధికారులకు కూడా యాజమాన్యం చెల్లిస్తున్నా కార్మికుల విషయానికి వచ్చే సరికి చెల్లించడం లేదు. కార్మికులకు వేతనాలతో పాటు ఇతర ప్రయోజనాలు వర్తింప చేస్తారు. వాహన, వాషింగ్, రాత్రిషిఫ్టు, ఇంటి అద్దె తదితర ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తారు. వీటిపై పడే ఆదాయపు పన్నును యాజమాన్యం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా ఇప్పటి వరకు అమలు చేయడం లేదు.
బినామీ పేర్లతో ఇబ్బంది సింగరేణిలో చాలా మంది కార్మికులు బినామీ పేర్లతో విధులు నిర్వహించారు. వారికి వాస్తవ పరిస్థితులు ఇబ్బందిగా మారాయి. ఒకే వ్యక్తికి రెండు పేర్లు ఉండటంతో అధికారిక పనుల్లో కొన్ని చోట్ల ఇబ్బంది ఏర్పడింది. పింఛను పొందే విషయంలోనూ చాలా మంది విశ్రాంత ఉద్యోగులు నష్టపోతున్నారు. కార్మికులు ఉద్యోగ విరమణ పొందిన తర్వాత పింఛను పొందాలంటే ఆధార్ కార్డును అనుసంధానం చేయాలి. విధులు నిర్వహించే సమయంలో ఒక పేరు ఉంటే ఆధార్ కార్డులో తమ సొంత పేరుతో నమోదు చేయించుకున్నారు. దీని వల్ల కంపెనీ నుంచి వెళ్లే రికార్డులో ఒక పేరు ఉంటే ఆధార్‌లో మరో పేరు ఉంటుంది. దీంతో సీఎంపీఎఫ్ నుంచి రావాల్సిన పింఛను నిలిపివేశారు. ప్రస్తుతం సంస్థలో పనిచేస్తున్న కార్మికులు కొంత మంది బినామీ పేర్లతో విధులు నిర్వహిస్తున్నారు. వాటిని సవరించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో దీనిపై హామీ కూడా ఇచ్చారు. కాని ఇప్పటి వరకు అమలు కాలేదు.

# శ్రీరస్తు.. నైపుణ్యమస్తు

ఖమ్మం : తెలంగాణలో రెండు ప్రభుత్వ కళాశాలలను కేంద్ర సర్కారు తొలి విడత 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా ఎంపిక చేసింది. వీటిలో ఖమ్మం, మహబూబ్‌నగర్ డైట్ కళాశాలలు ఉన్నాయి. జాతీయ నూతన విద్యావిధానానికి అనుగుణంగా బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ, ఇతర వసతులు కల్పించే లక్ష్యంతో ఖమ్మం డైట్ కళాశాలను కేంద్రం ఎంపిక చేసింది. ఇందుకోసం రూ.8 కోట్లు కేటాయించనుంది.
ఇదీ చరిత్ర..టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్(టీటీసీ) ఏడాది కాల పరిమితి కోర్సుతో ఖమ్మం డైట్ కళాశాల 1989లో ఏర్పాటైంది. 2000 సంవత్సరం నుంచి టీటీసీ బదులు డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (డీఈడీ) కోర్సు, 2016 నుంచి 'డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఐఎల్ఈడీ) రెండేళ్ల కోర్సు నిర్వహిస్తున్నారు. ఏడాదికి 100 సీట్ల చొప్పున 200 సీట్లున్నాయి. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ తదితర జిల్లాల విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు.
ఖాళీలే ఎక్కువ కళాశాలలో 23 అధ్యాపక పోస్టులకు కేవలం ఇద్దరు మాత్రమే రెగ్యులర్‌గా ఉన్నారు. వీరిలో ఒకరు ప్రిన్సిపల్ కాగా మరొకరు ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారి. సీనియర్ లెక్చరర్లు ఏడు పోస్టులకు ఏడూ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. 15 అధ్యాపకుల పోస్టులకు 13 ఖాళీలున్నాయి. బోధించేవారు లేకపోవటంతో ఈ ఏడాది ఎనిమిది మందిని అతిథి అధ్యాపకులుగా ప్రభుత్వం నియమించింది. వీరితోనే విద్యార్థులకు అరకొర బోధన సాగుతోంది.
కొత్తగా సీపీడీ విభాగం ఏర్పాటు ఉపాధ్యాయుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఈసంవత్సరం కొత్తగా నిరంతర వృత్తి శిక్షణాభివృద్ధి(సీపీడీ) విభాగం ఏర్పాటు చేసింది. ఈవిభాగంలో 12 మంది నిష్ణాతులు.. ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ ఇస్తారు. వారానికి నాలుగు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పాఠశాలలను సందర్శిస్తారు.

# రుణసాయం అరకొరే!



పెద్దపల్లి : లక్ష్యానికి అనుగుణంగా పంట రుణాల మంజూరుపై బ్యాంకర్లు ఆసక్తి చూపడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వానాకాలం పంటలకు 70 శాతంలోపే రుణాలు ఇవ్వగా ఈ యాసంగికి రుణసాయం ఇంకా నత్తనడకన సాగుతోంది. పంట రుణ ప్రణాళికల అమలు లక్ష్యంలో బ్యాంకర్లు అంతంత మాత్రంగానే స్పందిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా జిల్లాల బ్యాంకర్ల వార్షిక రుణ ప్రణాళిక ఖరారై ఏడు నెలలు దాటింది. బ్యాంకులు ఏటా ఏయే రంగాలకు ఎంత మొత్తంలో రుణాలు ఇవ్వాలో జిల్లా స్థాయి కమిటీ ఆమోదముద్ర వేసింది. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం రూ.12,532 కోట్లు నిర్దేశించారు. ఇందులో ఇప్పటి వరకు రూ.8,039 కోట్లు కేటాయించగా ఇంకా రూ.4,493 కోట్లు కేటాయించాల్సి ఉంది. ప్రభుత్వం పంట రుణ మాఫీ చేస్తామన్న హామీతో రుణాలు పునరుద్ధరణ చేసుకునేందుకు రైతులు ముందుకు రావడం లేదని బ్యాంకర్లు చెబుతున్నారు. ప్రతి మూడు నెలలకోసారి బ్యాంకర్ల సమీక్షలో లక్ష్యం చేరుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించినా ఫలితం ఉండటం లేదు. పంట రుణాలు కావాలని అడిగిన రైతులకు ఆంక్షలు విధిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని చోట్ల బ్యాంకులకు వెళ్లిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. గత అడ్డంకులను అధిగమిస్తేనే నిర్దేశించుకున్న రుణ లక్ష్యం చేరుకోనున్నారు. ఏటా బ్యాంకులు తమ వార్షిక ప్రణాళికలో వ్యవసాయ, అనుబంధ రంగాలకే అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు చెబుతున్నప్పటికీ ఆచరణ మాత్రం ఉండటం లేదు. బ్యాంకర్ల నిర్లక్ష్యం మూలంగానే అన్నదాతలకు రుణ సాయం అరకొరగానే అందుతోంది.
మాఫీలో జాప్యం
గత ప్రభుత్వం 2018 డిసెంబరు 11వ తేదీ వరకు ఉన్న పంట రుణాల్లో రూ.లక్ష వరకు మాఫీ చేసింది. వాటిని సకాలంలో ఇవ్వని కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొత్త ప్రభుత్వం రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ చేస్తుందనే ఆశలో రైతులు ఉన్నారు. గత ప్రభుత్వం రూ.లక్ష లోపు పంట రుణాలన్నింటినీ మాఫీ చేస్తామని చెప్పినా.. వివిధ కారణాలతో రూ.50 వేలు.. ఆపైన ఉన్న రుణాలు పూర్తిస్థాయిలో మాఫీ కాలేదు. రుణమాఫీకి అర్హులైన రైతులు ఎంతమంది ఉన్నారనే జాబితాయే వ్యవసాయశాఖ, అటు బ్యాంకర్ల వద్ద లేకపోవడం గమనార్హం. రుణమాఫీ చేస్తుందన్న ఆశతో చాలా మంది రైతులు పంట రుణాల పునరుద్ధరణకు ముందుకు రావడం లేదని బ్యాంకర్లు చెబుతున్నారు. వడ్డీ పెరుగుతుందని హెచ్చరిస్తుండటంతో కొంత మంది మాత్రమే ముందుకొస్తున్నారు. పునరుద్ధరణ చేసుకోని ఖాతాలు ఎన్‌పీఏ (నిరర్థక ఆస్తుల)లోకి వెళ్లే అవకాశం ఉంది. ప్రభుత్వం ఇప్పుడు పూర్తిగా రుణమాఫీ చేసినా పునరుద్ధరణ చేసుకోని వారికి వచ్చే సొమ్ము వడ్డీకే సరిపోతుందని బ్యాంకర్లు పేర్కొంటున్నారు.
ప్రాధాన్య రంగాలకూ వర్తింపు
రుణ ప్రణాళికలో పంట రుణాలతోపాటు వ్యవసాయ, అనుబంధ రంగాలకు లక్ష్యం కేటాయించారు. పంటల సాగు, యంత్ర పరికరాల కొనుగోళ్లు, బిందు, తుంపర సేద్యం, బోరుబావుల ఏర్పాటు, చేపల పెంపకం, పాడి పశువుల అభివృద్ధి, సాగు భూముల అభివృద్ధి తదితరాలకు రైతులకు రుణాలను మంజూరు చేయాలి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సహించేందుకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈసారి రూ.1,600 కోట్ల మేర లక్ష్యం విధించగా రూ.500 కోట్ల వరకు మాత్రమే రుణాలు పంపిణీ చేశారు. ఇతర ప్రాధాన్య రంగాలైన విద్య, గృహ నిర్మాణం తదితరాలకు రుణాలు మంజూరు చేస్తారు.
సమీక్షలు లేవు.. అవగాహన కరవు
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6.50 లక్షల మంది రైతులు సాగు చేస్తున్నారు. వానాకాలంలో అన్ని రకాల పంటల సాగు విస్తీర్ణం 12.40 లక్షల ఎకరాలుంటే, యాసంగిలో 8.10 లక్షల ఎకరాలు ఉంది. ఉద్యాన పంటలు 1.95 లక్షల ఎకరాల మేర సాగు చేయనున్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తవడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సాధారణ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వరి సాగు విస్తీర్ణమైతే రెండింతలైంది. బ్యాంకర్లు ఏటా పంటలకు ఇచ్చే రుణ పరిమితిని పెంచుతూ వస్తున్నారు. ఈ ఏడాది వరి సాగు చేసే రైతులకు ఎకరానికి రూ.42 వేల నుంచి రూ.45 వేల లోపు చెల్లించాలి. కానీ చాలా మందికి పాత రుణాలకు వడ్డీలు చెల్లించుకుని వాటినే పునరుద్ధరిస్తున్నారు. కొత్తగా ఇచ్చేది చాలా తక్కువ. వాటిలోనూ ఎకరానికి సగటున రూ.38 వేలకు మించి ఇవ్వడం లేదు. అదీకాకుండా పంట రుణాలపై వడ్డీ రాయితీ కింద 3 శాతాన్ని ప్రభుత్వం బ్యాంకులకు ఏటా విడుదల చేసేది. నాలుగేళ్లుగా రాయితీ విడుదల చేయడం లేదు. ప్రతి మూడు నెలలకోసారి రుణ వితరణపై బ్యాంకర్లతో సమీక్షించాలి. గ్రామ స్థాయిలో వ్యవసాయశాఖ అధికారులతో రైతులకు అవగాహన కల్పించాల్సి ఉన్నా అటువంటివేమీ పకడ్బందీగా జరగకపోవడంతో రుణ పరిమితిపై రైతులకు అవగాహన కరవైంది.

# తొలగిస్తారా.. కొనసాగిస్తారా!



పెద్దపల్లి : దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఈ మేరకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సేకరించారు. కార్డు ఉండీ కొన్నేళ్లుగా సరకులు తీసుకోని వారిపై దృష్టి సారించారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సహాయంతో జిల్లాల వారీగా ఇప్పటివరకు సరకులు పొందని వారి రేషన్ కార్డుదారులను గుర్తించారు. ఆహారభద్రత కార్డులను ఇబ్బడిముబ్బడిగా ధనవంతులకు కూడా పంపిణీ చేయడంతో సరకులు తీసుకెళ్లడం లేదని నిర్ధారణకు వచ్చారు. వీరిని తొలగించడమా? లేక కొనసాగించడమా? అనే విషయమై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. దీంతో బోగస్ కార్డుల తొలగింపుతో పాటు కొత్త కార్డులు మంజూరు కానున్నాయి.
పోర్టబులిటీలో కరీంనగర్ ప్రథమం
నిత్యావసర సరకుల పంపిణీలో అక్రమాల నివారణకు బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్నారు. సొంత స్థలంలో కార్డు కలిగి ఉండి, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు ఎక్కడ నుంచి అయినా సరకులు తీసుకునేందుకు ప్రభుత్వం 'పోర్టబిలిటీ' విధానం అమలు చేస్తోంది. దీనికి వినియోగదారుల నుంచి ఆదరణ పెరుగుతోంది. ఉద్యోగ, ఉపాధిరీత్యా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఉమ్మడి జిల్లా పరిధిలో కరీంనగర్‌లో అధికంగా ఉండటంతో పోర్టబిలిటీ వినియోగంలో మొదటి స్థానంలో ఉంది. జగిత్యాలలో తక్కువ మంది ఈ సౌకర్యం వినియోగించుకుంటున్నారు. పెద్దపల్లి జిల్లాలో 2,37,984 కిలోలు, కరీంనగర్‌లో 6,28,850 కిలోలు, జగిత్యాలలో 63,675 కిలోలు, రాజన్న సిరిసిల్లలో 2,33,129 కిలోలను ప్రతి నెలా పోర్టబిలిటీ విధానంలో బియ్యం తీసుకుంటున్నారు.
మూడేళ్లుగా నిరీక్షణరాష్ట్రంలో దాదాపు మూడేళ్లుగా కొత్త రేషన్ కార్డుల మంజూరు కోసం అర్హులు నిరీక్షిస్తున్నారు. అప్పటి నుంచి మార్పులు, చేర్పులకు కూడా అవకాశం లేకుండా పోయింది. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న ప్పటికీ పంపిణీ చేయడం లేదు. ఆహారభద్రత కార్డులు లేకపోవడంతో నిరుపేదలు సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. ఆరోగ్యశ్రీ సేవలు అందక ఆర్థికంగా నష్టపోతున్నారు. ఎట్టకేలకు కొత్త కార్డులు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.
ఆధునిక సాంకేతికతతో గుర్తింపు
ఉమ్మడి జిల్లాలో 9,49,181 ఆహారభద్రత కార్డుల పరిధిలో దాదాపు 25 లక్షల మంది సభ్యులున్నారు.
ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరోగ్యశ్రీలో ఉచిత వైద్య సేవలకు పొందేందుకు కొందరు ధనవంతులు, అనర్హులు కూడా రేషన్ కార్డులు పొందారు.
గతంలో నిర్వహించిన అంతర్గత తనిఖీల్లో బోగస్ కార్డులు గుర్తించినప్పటికీ తొలగింపుపై సందిగ్ధం నెలకొంది.
కొత్త ప్రభుత్వం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి, ఇప్పటివరకు రేషన్ సరకులు తీసుకోని వారిని గుర్తించింది.
ప్రతి నెలా దాదాపు 15 శాతం మంది సరకులు తీసుకోవడం లేదు. వీరిలో కొందరు ఒక నెల తీసుకుంటూ మరో నెల వదిలేస్తున్నారు. ఇక 10 శాతం వరకు ఏళ్ల తరబడి సరకులు తీసుకెళ్లడం లేదని గుర్తించారు.
ఇలాంటి వారి జాబితాను రాష్ట్ర స్థాయిలో గుర్తించగా దాన్ని జిల్లాలకు పంపించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.
దరఖాస్తులపై అందని మార్గదర్శకాలు
రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఆహారభద్రత కార్డుల కోసం దరఖాస్తు చేసిన వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ నెల 28న కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పక్షం రోజుల పాటు గ్రామసభలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆరు గ్యారంటీల్లో మరికొన్నింటిని అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందులో రేషన్ కార్డుల పంపిణీ కూడా ఉంటుందని భావిస్తుండగా గతంలో చేసిన దరఖాస్తులు పని చేస్తాయా? లేదా కొత్తగా అర్జీ పెట్టుకోవాలా? అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు.

# డంపింగ్‌యార్డుకు మోక్షమెన్నడో?

ధర్మపురి : ధర్మపురి పురపాలికలో డంపింగ్‌యార్డు నిర్మాణం కలగానే మిగిలిపోయింది. పట్టణంలో సేకరించిన చెత్తను నదీ తీరంలోని శ్మశాన వాటిక వద్దే పడేస్తున్నారు. దీంతో నదికి వచ్చే భక్తులకు కొంత అసౌకర్యంగా ఉంటోంది. ఇప్పటికే పలు చోట్ల డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని యోచించినా, స్థల సేకరణే సమస్యగా మారింది. ధర్మపురి పట్టణంలో 15 వార్డుల్లోని పలు వీధుల్లో చెత్తను 7 స్వచ్ఛ వాహనాల్లో తడి, పొడి చెత్తగా సేకరిస్తున్నారు. వీటిని డంపింగ్ యార్డులో వేయాల్సి ఉంది. దీనికి రీసైక్లింగ్ ప్లాంటు కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే మొదట కమలాపూర్‌కి వెళ్లే దారిలో ఏర్పాటు చేయగా, దూరం కావడం, అనుకూలంగా లేదని ఆపేశారు. ఆ తర్వాత తిమ్మాపూర్, మద్దునూర్ గండి వద్ద యోచించినా స్థానికుల అభ్యంతరాలతో నిలిచి పోయింది. ప్రస్తుతం డంపింగ్‌యార్డుకు స్థలం లేక గోదావరి నది తీరంలోని శ్మశాన వాటిక వద్దే పడేస్తున్నారు. ఈ విషయమై పుర కమిషనర్ సీహెచ్. రమేష్ మాట్లాడుతూ.. ఇప్పటికే రెండు చోట్ల ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించామని, అభ్యంతరాలతో నిలిచి పోయిందన్నారు. మళ్లీ రెవెన్యూ అధికారులతో స్థలాన్ని పరిశీలిస్తామన్నారు.

# నిత్యం పగుళ్లు.. వీధుల్లో పరవళ్లు

పెద్దపల్లి : తాగునీటి వ్యవస్థను మెరుగుపరిచి, ఇంటింటికీ శుద్ధ జలాలు అందించేందుకు గత ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం అస్తవ్యస్తంగా మారింది. నాసిరకంగా చేసిన పనులతో ఎక్కడికక్కడ పైపులు పగిలి నీరంతా వృథాగా పారుతోంది. జిల్లాకేంద్రంలో పైపుల లీకేజీ తీవ్రంగా ఉంది. భగీరథ పైపులైన్లు దెబ్బతిని తాగునీటిని ఇతర అవసరాలకు వాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం ఏటా తాగునీటి అవసరాలు తీర్చడానికి రూ.లక్షలు వెచ్చిస్తున్నా నిర్వహణపరమైన లోపాలతో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. పెద్దపల్లి పురపాలికలో విలీనమైన గ్రామాల పరిస్థితి గతంతో పోలిస్తే మరింత దిగజారింది.
మరమ్మతుకు ప్రతి నెలా రూ.లక్ష
పెద్దపల్లి పట్టణంలో ఏ వీధిలో చూసినా పైపుల లీకేజీలే కనిపిస్తున్నాయి. ప్రతి రోజూ ఎక్కడో ఓ చోట కొత్తగా సమస్య వెలుగుచూస్తోంది. నిత్యం రెండు చోట్ల మరమ్మతులు నిర్వహిస్తుండగా ప్రతి నెలా 50 వరకు అతుకులు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కో లీకేజీ మరమ్మతు కోసం రూ.1000 నుంచి రూ.2 వేల వరకు వెచ్చిస్తున్నారు. ఇలా కేవలం మరమ్మతుల కోసమే నెలకు రూ.లక్ష వరకు వ్యయమవుతోంది. పట్టణంలోని ప్రతి వీధిలోనూ ఇలాంటి లీకేజీల బెడద తీవ్రమైంది. నల్లాల ద్వారా మురుగు రావడం పరిపాటిగా మారింది.
నిర్లక్ష్య ఫలితమే
అభివృద్ధి పనుల నిర్వహణలో అధికారులు, గుత్తేదారుల నిర్లక్ష్యం లీకేజీలకు కారణమవుతోంది. రాజీవ్ రహదారి విస్తరణ సమయంలో



పైపులైన్‌ను రోడ్డు పక్కన వేయాల్సి ఉండగా అవేవీ పట్టించుకోలేదు. పాత పైప్‌లైన్ రోడ్డు దిగువకు వెళ్లడంతో భారీ వాహనాలు వచ్చినపుడు రహదారి మధ్యలో లీకేజీలు ఏర్పడుతున్నాయి.
పట్టణంలోని కూనారం రోడ్డు, ప్రభుత్వ ఆస్పత్రి, అయ్యప్పకూడలి, బస్టాండ్ ప్రాంతం, కమాన్ ప్రాంతంలో ఇలాంటి లీకేజీలు ఎక్కువగా ఉన్నాయి. అయ్యప్ప ఆలయం నుంచి అమర్‌నగర్ వరకు రహదారి విస్తరించిన సమయంలోనూ పైప్‌లైన్‌లను రోడ్డు వెలుపలికి మార్చకపోవడంతో వాహనాల తాకిడికి పైపులు పగిలి లీకేజీలు ఏర్పడ్డాయి. వీటి మరమ్మతుకు కూడా మున్సిపల్ అధికారులు ప్రయత్నించడం లేదు. ఇక వేంకటేశ్వరాలయం నుంచి ఆస్పత్రికి వెళ్లే దారిలో భారీ వాహనాలను నిలిపి ఉంచడంతో ఈ ప్రాంతంలోని పైపులు సైతం ధ్వంసమవుతున్నాయి. ఇవే కాకుండా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు పైపులకు ప్రమాదకరంగా మారాయి. ప్రస్తుతం విస్తరణ పనులు జరుగుతున్న కమాన్‌రోడ్డులో పైప్‌లైన్లకు చేపడుతున్న మరమ్మతులు శాశ్వత పద్ధతిలో ఉండాలని ప్రజలు కోరుతున్నారు.
సర్వే చేయిస్తున్నాంపట్టణంలో మిషన్ భగీరథ లైన్లను పూర్తి స్థాయిలో మున్సిపాలిటీకి అప్పగించలేదు. ఈ క్రమంలో లీకేజీలకు కారణాలపై మిషన్ భగీరథ అధికారులతోనే సర్వే చేయిస్తున్నాం. రెండు, మూడు రోజుల్లో పరిశీలన పూర్తి చేసి, లీకేజీలకు కారణాలను విశ్లేషిస్తాం. శాశ్వత పరిష్కారంపై ఇంజినీరింగ్ అధికారులకు మార్గనిర్దేశనం చేశాం. వారం, పది రోజుల్లో సమస్య పరిష్కారమవుతుంది. ఆకుల వెంకటేశ్, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్

# రంగుల కల నెరవేరునులే..!

చర్ల : చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు రంగుల కల ఎట్టకేలకు నెరవేరనుంది. ప్రాజెక్టు నిర్మాణం అనంతరం సుదీర్ఘకాలం తర్వాత పదిహేడేళ్లకు మళ్లీ ఈ ప్రాజెక్టు నూతన రంగుల శోభతో అలరించనుంది. ఎట్టకేలకు ఇందుకోసం రూ. 1.50 నిధులు మంజూరయ్యాయి. ప్రాజెక్టుకు ప్రతి అయిదేళ్లకోసారి రంగులు వేయాల్సి ఉన్నా.. కొన్నేళ్లుగా నిధుల లేమితో ఆ ఊసే లేకుండా పోయింది. ఫలితంగా ప్రాజెక్టు కళా విహీనంగా మారింది. దీంతో పాటు విలువైన వస్తువులు దెబ్బతింటున్నాయి. ప్రధానంగా హయస్టు వంతెనకు రంగులు వేయకపోవడంతో సామాగ్రి తుప్పు పట్టే స్థితికి చేరింది. ఈ వంతెన అంతా ఇనుముతో కూడుకోవడంతో అది తుప్పుపట్టి నాణ్యత కోల్పోయే పరిస్థితి నెలకొంది. దీనిపై వరుస కథనాలనూ ప్రచురించింది. 17ఏళ్లగా రంగులు వేయకపోవడంతో రైతుల వరప్రదాయినికి భవిష్యత్తులో జరగనున్న నష్టంపై విశ్లేషణాత్మక కథనాలూ ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు ప్రభుత్వం రంగులకు నిధులు మంజూరు చేసింది.
అధికారుల నివేదికతో..
తాలిపేరు ప్రాజెక్టు నిర్మాణం తర్వాత 2006లో చివరిసారిగా రంగులు వేశారు. ప్రాజెక్టుకు రంగుల ఆవశ్యకతపై అధికారులు ఎన్నోసార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఏళ్లతరబడి నిధుల మంజూరుకు నోచుకోలేదు. డ్యామ్ సేఫ్టీ సెల్ అధికారులు తమ పరిశీలనలో ఈ ప్రాజెక్టుకు రంగులు వేయాలని అధికారులకు సూచనలు చేశారు. రంగులు వేయకుంటే దాని రక్షణపై తీవ్ర ప్రభావం ఉంటుందని హెచ్చరికలు చేశారు. దీంతో ప్రాజెక్టు అధికారులు ఆ నివేదికను ప్రభుత్వానికి పంపారు. ఇంకా జాప్యం చేస్తే ప్రాజెక్టులో ముఖ్యమైన ఇనుప సామాగ్రి నాణ్యత కోల్పోయి ప్రాజెక్టు రక్షణపై ప్రభావం తప్పదని నివేదికలో పేర్కొన్నారు.
రూ.1.50 కోట్లు మంజూరు
దీంతో ప్రభుత్వం ప్రాజెక్టుకు రంగులు వేసేందుకు రూ. 1.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో హయస్టు వంతెనతో పాటు గేట్లు, కింద వంతెనకు సైతం పూర్తిస్థాయిలో రంగులు వేయనున్నారు. ఈ పనులకు సంబంధించి ఇప్పటికే టెంగర్ ప్రక్రియ పూర్తిచేసిన అధికారులు అగ్రిమెంట్‌ను సైతం పూర్తిచేశారు. వచ్చే ఏడాది మార్చి నెలలో ఈ పనులు ప్రారంభం కానున్నాయి. అనంతరం రెండు నెలల్లో పనులు పూర్తి చేయనున్నారు. ఎట్టకేలకు ప్రాజెక్టు కొత్త కళను సంతరించుకోనుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# నగరానికి నయా జోష్

హైదరాబాద్ : రాజధానిలో ప్రభుత్వ యంత్రాంగానికి కొత్త జవసత్వాలు కల్పించేందుకు సర్కారు సిద్ధమైంది. ఇప్పటికే మహా నగరంలో కీలక పాత్ర పోషించే పోలీసు కమిషనర్ల బదిలీలను పూర్తి చేయగా, ఇప్పుడు జిల్లా కలెక్టర్లతో పాటు ఇతర అధికారులను బదిలీ చేసి కొత్తవారిని నియమించడానికి ఉన్నత స్థాయిలో కసరత్తు జరుగుతోంది. ఇవి పూర్తయిన తరువాత సంబంధిత విభాగాల్లో చాలా ఏళ్లుగా ఒకే చోట ఉన్నవారి బదిలీలు చేయడానికి సైతం అంతర్గతంగా ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నెలాఖరుకల్లా ఇవన్నీ పూర్తి చేసి కొత్త సంవత్సరం నుంచి నగర పాలనను పరుగులు పెట్టించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. మార్పులు ఇలా..

నగరంలో శాంతిభద్రతల పరంగా కీలకమైన ముగ్గురు పోలీసు కమిషనర్లుగా వారం రోజుల కిందట కొత్తవారిని నియమించారు. మూడు కమిషనరేట్ల పరిధిలోని డీసీపీ స్థాయిలో కూడా పెద్దఎత్తున బదిలీలు జరుగుతున్నాయి. మిగిలిన పోస్టుల్లో కూడా పూర్తయ్యాక అంతర్గతంగా బదిలీలు చేయాలని నిర్ణయించారు. ఎన్నికలకు ముందు ఏసీపీ, సీఐ, ఎస్ఐ స్థాయిలోని అధికారులు అప్పటి ఎమ్మెల్యేల పైరవీలతో నియమితులయ్యారు. వీరిలో చాలా మందిపై అనేక ఆరోపణలు కూడా ఉన్నాయి. రాజకీయ సిఫార్సులు లేకుండా తాజాగా వీరందరినీ బదిలీలు చేయాలని కమిషనర్లు భావిస్తున్నారు. జలమండలి, హెచ్ఎండీఏ విభాగాలకు రెండురోజుల కిందట కొత్త అధికారులు నియమితులయ్యారు. ఇప్పుడు మిగిలిన విభాగాలపై దృష్టి సారించారు. ఎన్నికలకు ముందు హైదరాబాద్ కలెక్టర్, ఎన్నికల



సమయంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్ బాధ్యతలు చేపట్టారు. రాజధాని కేంద్రంగా పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో రెండు జిల్లా కలెక్టర్లను బదిలీ చేసే అవకాశముందంటున్నారు. నగర పాలనలో కీలకమైన బల్దియా కమిషనర్‌గా ఆరు నెలలకిందట రోనాల్డ్ రాస్ వచ్చారు. క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. నిధులు అందుబాటులో లేక అభివృద్ధి పనులు పెద్దఎత్తున చేపట్టడం లేదు. వారంలో ఐఏఎస్ అధికారులు బదిలీలు మరో విడత జరగబోతు న్నాయి. ఈలోపు కమిషనర్ బదిలీపై ఒక నిర్ణయానికి వస్తారని చెబుతు న్నారు. తరువాత జెడ్సీలు, డీసీలపై దృష్టి సారించే అవకాశముంది. నెలాఖరు నుంచి కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరించబో తున్నారు. నగరానికి సంబంధించి పౌరసరఫరాల శాఖ సీఆర్‌వోగా బాలమాయా దేవి దీర్ఘకాలంగా ఇక్కడే ఉన్నారు. ఆమెకు స్థానచలనం ఉంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇతరత్రా మరికొన్ని విభాగాల్లో ఇదే కసరత్తు జరుగుతోంది.

## పాత దస్తావేజులుంటే చాలు..
## రూ.కోట్ల భూములు స్వాహా

హైదరాబాద్ : పాత దస్తావేజులుంటే చాలు.. నగరంలో రూ.కోట్ల విలువైన స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. న్యాయస్థానాలను ఆశ్రయించి హక్కులుపొందే ప్రయత్నాలు చేస్తున్నారు. కోర్టు వివాదాల్లోని భూములపై రెవెన్యూ అధికారులు కౌంటర్లు దాఖలుచేస్తుండగా మరోపక్క వాటిల్లో నిర్మాణాలు చేస్తున్నారు. ఖరీదైన ప్రాంతాల్లో భూముల ఆక్రమణలు, వాటి పరిరక్షణపై ఇటీవల జిల్లా రెవెన్యూ అధికారుల సమీక్షలో ఇవన్నీ చర్చకు వచ్చాయి. హైదరాబాద్ జిల్లాలో 539 ఎకరాల ప్రభుత్వ భూమిఉండగా, ఇందులో 127 ఎకరాలు కోర్టు వివాదాల్లో ఉన్నాయి. వీటి విలువ రూ.700 కోట్ల నుంచి రూ.800 కోట్లు. ఈ ఆక్రమణలన్నీ పాత దస్తావేజులతోనే చేశారని గుర్తించారు. వీటిని తిరిగి ప్రభుత్వపరం చేసేందుకు కార్యచరణ చేపట్టాలని అన్ని మండలాల తహసీల్దార్లకు లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేశారు. నాలుగైదు నెలలక్రితం ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమించుంటే.. రెవెన్యూ అధికారులనే బాధ్యులను చేస్తామంటూ హెచ్చరించారు.

కంచెలు.. బోర్డులకు నిధుల్లేవ్

ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు జిల్లా యంత్రాంగంవద్ద సరైన వ్యవస్థ లేదు. ఈ భూములను ఎవరైనా ఆక్రమిస్తే వెంటనే తెలుసుకునేందుకు వీలుగా ఆయా భూములకు జియోట్యాగింగ్ చేస్తామని పదిహేనేళ్ల క్రితం ప్రకటించారు. మరి ఈ ప్రక్రియ ఏమైందో అధికారులకే తెలియదు. షేక్‌పేట్ మండలంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మారేడ్‌పల్లి, ఆసిఫ్‌నగర్, బండ్లగూడ, బహదూర్‌పుర, అంబర్‌పేట్ మండలాల్లోని ఖరీదైన ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారన్న ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వ స్థలాల్లో ఎవరూ చొరబడకుండా సరిహద్దులు గీసి చుట్టూ కంచెలు ఏర్పాటుచేయాలని, హోర్డింగుల తరహాలో పెద్ద బోర్డులను స్థలాల్లో ఉంచాలని ఆరేడేళ్ల క్రితం అధికారులు అనుకున్నారు. కంచెలు, బోర్డులకు నిధుల్లేక ఎక్కడైతే రూ.కోట్ల విలువైన భూములున్నాయో అక్కడ మాత్రం ఇనుప కంచెలనుంచారు. రహదారులకు దూరంగా ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్రహరీలు, భవనాలను నిర్మిస్తే వాటిని పడగొట్టి ఆయా గోడలపైనే ప్రభుత్వ భూములంటూ రాశారు.

ల్యాండ్ బ్యాంక్‌యాప్.. అదృశ్యం

హైదరాబాద్ నగరంలోని ఖరీదైన భూములను ఆక్రమించకుండా ఎప్పటికప్పుడు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకునేందుకు వీలుగా హైదరాబాద్ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన శ్వేతా మహంతి సమాచార సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే 'ల్యాండ్ బ్యాంక్'యాప్‌ను రూపొందించారు. రెవెన్యూ అధికారులు రోజూ ప్రభుత్వ స్థలాల వద్దకు వెళ్లి వాటి ఫొటోలు తీసి ల్యాండ్‌బ్యాంక్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే చాలు.. జిల్లా కలెక్టరేట్, హైదరాబాద్, సికింద్రాబాద్ ఆర్డీవోల కార్యాలయాల్లోని ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సమాచార కేంద్రానికి వెళతాయి. రెవెన్యూ అధికారులు అప్‌లోడ్ చేసిన చిత్రాలు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు నిరంతరం చూసుకోవచ్చు. రాత్రికి రాత్రి ఎవరైనా ఆక్రమించినా, బోర్డులు ఏర్పాటు చేసినా వెంటనే తెలుస్తుంది. వాటిని తీసేయడం, పోలీసులకు ఫిర్యాదు చేయడం క్షణాల్లో జరుగుతుంది. యాప్ ఫలితాలు సంతృప్తికరంగా ఉన్న దశలో శ్వేతా మహంతి బదిలీపై వెళ్లడంతో తర్వాత అధికారులు యాప్‌ను అటకెక్కించారు.

# నైపుణ్యం కట్టుకోండి..!



పరిగి : గ్రామీణ ప్రాంత యువతకు తగిన శిక్షణ అందిస్తే కొందరు స్వయంగా ఉపాధి పొందుతారు. మరికొందరు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగంలో చేరతారు. ఇదే ఉద్దేశంతో ప్రభుత్వం 'నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని' పరిగిలో ఏర్పాటుచేసింది. దీనివల్ల మంచి ప్రయోజనం చేకూరి యువత ఆర్థికంగా నిలదొక్కుకుంటారని భావించారు. కానీ కార్యాచరణ సక్రమంగా లేక లక్ష్యం నెరవేరడంలేదు. దీనికి సంబంధించి కథనం.

కూలీలకే పరిమితం కాకూడదని..

నిరుపేద యువత సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' అమలుచేస్తున్నా క్షేత్ర స్థాయిలో అనుకున్న ఫలితాలు కనిపించడంలేదు. ఇప్పటివరకు ఈ పథకం కూలీలకే పరిమితమైంది. ఏటా కోట్లాది రూపాయలు వ్యయమవుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం ఆశించిన అభివృద్ధి జరగడం లేదని బహిరంగ విమర్శలే ఉన్నాయి. దీనిని పరిగణలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం పథకాన్ని గాడిన పెట్టేదిశగా గతంలోనే ప్రయత్నించింది.

2013లో లైఫ్‌కు శ్రీకారం: ఈ క్రమంలో మొదట 'పూర్తి స్థాయి జీవనోపాధి ఉద్యోగం' (లైఫ్) కార్యక్రమానికి 2013 శ్రీకారం చుట్టింది. దీని కింద 25 మంది దాకా గ్రామీణ యువతకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినా ఇప్పటివరకు ఒక్క బ్యాచ్‌కు కూడా శిక్షణ ఇవ్వలేదు. రెండేళ్లుగా 'ఉన్నతి' పేరుతో మొయినాబాద్‌లో కొత్త కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా ఇది నిరంతరంగా జరిగే ప్రక్రియగా కొనసాగించాల్సి ఉంది.

వీటిపై దృష్టి సారించాలి

బ్యూటీ పార్లర్, కేశాలంకరణ, పాడి, మత్స్య పరిశ్రమ, గొర్రెలు, మేకల పెంపకం, బయోగ్యాస్ ప్లాంటు, దుస్తుల తయారీ, ఫ్యాషన్ డిజైనింగ్, కొరియర్, వాహనాల రిపేరింగ్ తదితరాలు వంటి కొత్త నైపుణ్య పనులను ఎంపిక చేసుకునేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది.

కోరుకున్న వాటిపైనే శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని ఏడేళ్ల క్రితం భావించింది.

వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడంతోనే పేద కుటుంబాలకు ఎక్కువగా ప్రయోజనం కలుగుతుందని గుర్తించారు. ఈ విభాగాలకు సంబంధించి ఎలాంటి శిక్షణ కార్యక్రమాలు అమలు చేయడంలేదు.

గ్రామీణ ప్రాంతాల్లో పదోతరగతి, ఇంటర్ వరకు మాత్రమే చదువుకుని చాలా మంది ఉన్నత చదువులకు దూరంగా ఉంటున్నారు. అంతేగాకుండా స్వయం ఉపాధి రంగాల్లోనూ రాణించాలన్నా ఆర్థిక పరిస్థితులు అనుకూలించక కొందరు దొరికిన పనితో నెట్టుకొస్తున్నారు.

దెబ్బతింటున్న భవనం

పరిగిలో 2013లోనే రూ.40లక్షల వ్యయంతో జీవనోపాధుల వనరుల కేంద్రాన్ని నిర్మించారు. వినియోగించని కారణంగా నిర్వహణ లోపంతో భవనం పాడవుతోంది. జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాలు ఎక్కువగా వ్యవసాయాధారిత ప్రాంతాలే. మొత్తం మండలాల్లో 1,81,983 జాబ్‌కార్డులు ఉండగా 2,77,450 మంది కూలీలుగా నమోదై ఉన్నారు.

ఉన్నతి కింద ప్రోత్సహిస్తున్నాం

ఉష, ఏపీఓ, పరిగి

ఉపాధి పథకంలో ప్రభుత్వం అనేక మార్పులను తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తోంది. గతేడాది ఉన్నతి కింద మొయినాబాద్‌లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు జరిగాయి. ఈసారి కూడా నిర్వహించే వీలుంది. ఈ భవనం విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

# పర్యావరణ వృద్ధి.. ఆరోగ్య సమృద్ధి



వికారాబాద్ : పట్టణ, నగరవాసులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలి. మొక్కలు, జీవ వైవిధ్యంపై అవగాహన కల్పించాలి. పర్యావరణ పరిరక్షణ, అటవీశాతం పెంపుతో ఆరోగ్య ప్రయోజనాలను విస్తరించాలి. ఇదే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'నగర్ వన్ యోజన' పథకాన్ని 2020–21 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టింది. దీన్ని వచ్చే 2024–25 వరకు కొనసాగిస్తారు. ఇందులో భాగంగా జిల్లాలోని గొట్లపల్లి, అంతారం గ్రామాలను 5 నెలల క్రితమే ఎంపికచేసి ఇంకుడు గుంతల తవ్వకం, మొక్కల పెంపకం వంటి పనులు చేపట్టారు.

స్థానిక సంస్థల భాగస్వామ్యం

వనాల సృష్టి కోసం ప్రారంభమైన నగర్ వన్ యోజనలో స్థానిక సంఘాలు, ఎన్‌జీఓలు, విద్యా సంస్థలు, స్థానిక సంస్థల భాగస్వామ్యంతో పట్టణ అటవీ సంరక్షణను ప్రోత్సాహిస్తారు. జిల్లాలోని కొడంగల్ మండలం అప్పాయిపల్లి, పరిగి మండలం జాఫర్‌పల్లి, వికారాబాద్ పట్టణంలోని అనంతగిరి, పెద్దేముల్ మండలం గొట్లపల్లి– అంతారం ప్రాంతాల్లో నగర్ వన్ యోజన పథకం కోసం ప్రతిపాదనలు పంపించగా, తాండూర్ ప్రాంతంలో కాలుష్యం అధికంగా ఉండటంతో అంతారం గ్రామాన్ని, పెద్దేముల్ మండలం గొట్లపల్లి గ్రామాన్ని ఎంపిక చేశారు. రాష్ట్రంలో 47 ప్రాజెక్టులను ఎంపిక చేయగా, అందులో గొట్లపల్లి– అంతారం ఒకటి. ఈ పథకం అమలు కోసం రూ.1.5 కోట్లు మంజూరు చేశారు.

బొంరాస్‌పేట చెరువు సుందరీకరణకు చర్యలు..: బొంరాస్‌పేట మండల పరిధిలోని బొంరాస్‌పేట చెరువు సుందరీకరణ కోసం కూడా చర్యలు తీసుకోనున్నారు. బీజాపూర్ జాతీయ రహదారి పక్కనే చెరువు ఉండటంతో రాకపోకలు సాగించే వారు చెరువు దగ్గర ఆగి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తారు. చెరువును అభివృద్ధి చేస్తే పర్యాటక ప్రేమికులను మరింతగా ఆకర్షిస్తుందని గ్రామస్థులు జిల్లా అటవీ శాఖాధికారికి ఇటీవలే వినతిపత్రం సమర్పించారు. అందుకు అనుగుణంగా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.

ఇవీ చేపట్టేవి

1.25 లక్షల ఎకరాల చుట్టూ కంచె (ఫెన్సింగ్) ఏర్పాటు.

దశల వారీగా జల సంరక్షణకు ఊట కుంటల నిర్మాణం. ఉద్యానవనం ఏర్పాటు.

30 వేల వరకు వివిధ రకాల మొక్కలు నాటి సంరక్షించడం.

వాచ్‌టవర్, తాగునీటి సౌకర్యం, శౌచాలయాలు తదితర సౌకర్యాల కల్పన. రూ.6 లక్షల వ్యయంతో ఇంకుడు గుంతల తవ్వకం (ఈ పని మొదలైంది).

పనులు ప్రారంభించాం – జ్ఞానేశ్వర్, జిల్లా అటవీశాఖాధికారి

నగర్‌వన్ యోజన పథకం కింద గొట్లపల్లి– అంతారం గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాం. దశల వారీగా మిగతావి చేపడతాం. బొంరాస్‌పేట చెరువు సుందరీకరణ చేయాలని గ్రామస్థులు కోరారు. ఏయే పనులు చేస్తే బాగుంటుందనేది క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతిపాదనలు పంపిస్తాం.

# నాణ్యత నాస్తి.. వసూళ్లు జాస్తి

హైదరాబాద్: నగరంలోని ప్రైవేటు వసతి గృహాల నిర్వహణ రోజురోజుకూ అధ్వానంగా మారుతోంది. భాగ్యనగరంలో ఇంటి అద్దెలు భారీగా పెరగడంతో చాలామంది హాస్టల్స్‌లో ఉండేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో వాటికి డిమాండ్ పెరిగింది. కరోనా మహమ్మారి సమయంలో నష్టాలను చవిచూసిన వసతి గృహాల యజమానులు ఇదే అదనుగా భావించి ఇరుకు గదులను అయిదు నుంచి ఆరుగురికి కేటాయిస్తున్నారు. ఒక్కొక్కరి దగ్గర రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకూ తీసుకుంటున్నారు. ఇద్దరు.. ముగ్గురు ఉండే షేరింగ్ గదులకు ఒక్కొక్కరికి రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇంత మొత్తం తీసుకుంటున్నా భోజనం ఏమాత్రం నాణ్యత ఉండటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాద నివారణ చర్యలు కరవు.. అపార్ట్‌మెంట్లను అద్దెకు తీసుకొని ఒక్కోదానిలో వందల మందిని ఉంచుతున్నారు. పది నుంచి పదిహేను మంది ఒకే టాయిలెట్ వాడుకోవాల్సిన పరిస్థితి. చాలా భవనాల్లో ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించడం లేదు. దురదృష్టవశాత్తు అగ్ని ప్రమాదం సంభవిస్తే ఊహించని రీతిలో నష్టం జరిగే అవకాశం ఉంటుంది.

బలవంతంగా తినడమే..

హాస్టల్ యజమానులు వేల రూపాయలు వసూలు చేస్తున్నా రుచికరమైన



భోజనం పెట్టడం లేదని అశోక్‌నగర్ పరిధిలోని హాస్టళ్లలో ఉంటున్న పలువురు విద్యార్థులు వాపోయారు. సంవత్సర కాలంగా మేము ఇక్కడ ఉంటున్నా.. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఒక్కసారి కూడా తనిఖీకి రాలేదని అక్కడ ఉద్యోగ శిక్షణ తీసుకుంటున్న ఇద్దరు విద్యార్థులు అన్నారు. హాస్టల్ ఫీజుతోపాటు అదనంగా నిర్వహణ పేరుతో వందల్లో వసూలు చేస్తున్నా సరిగా శుభ్రత సైతం పాటించడం లేదని వాపోయారు. అధికారులు ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుంటే నిర్వాహకుల్లో భయం ఉంటుందని.. పరిస్థితులు కాస్తయినా మెరుగుపడతాయని.. ఆదిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# అన్నదాతా.. అప్రమత్తం

జగిత్యాల : జిల్లాలో ఈ యాసంగిలో సాగునీటి లభ్యతతో సాధారణం కన్నా అధికంగా పంటలను సాగుచేస్తున్నారు. ఇప్పటికే పలు ఆరుతడి పంటలను విత్తుకోగా వరినార్లు పోస్తున్నారు. ఇదే అదనుగా మోసగాళ్లు నకిలీ ఉత్పాదకాలను రైతులకు అంటగడుతున్నారు. చాలా గ్రామాల్లో కంపెనీల ప్రతినిధులు రైతుల నుంచి అడ్వాన్సులు తీసుకుని గుట్టుగా సేంద్రియ ఎరువుల బస్తాలను సరఫరా చేస్తున్నారు. సేంద్రియ ఎరువులు, మిశ్రమ, ఎరువులు, గంటగోళీలు, జింకుసల్ఫేట్, వర్మివాష్, వర్మికంపోస్టు, బయో ఫర్టిలైజర్స్, పోషక మందుల పేరిట పెద్దఎత్తున నకిలీ, మోసపూరిత ఉత్పత్తులను రైతులకు విక్రయిస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పోషకాలు తదితర ఎలాంటి పంట ఉత్పాదకమైనా సదరు కంపెనీ స్థానిక ఏవో ద్వారా విక్రయ లైసెన్సును తీసుకోవాలి. నిర్దేశిత దుకాణంలోనే రైతులకు విక్రయించాలి. దుకాణాల్లో ఉత్పత్తుల నిల్వలు, ధరలను దుకాణం ఎదుట బోర్డుపై రాయాలి. ఏ ఉత్పాదకమయినా గ్రామాల్లో అడ్వాన్సులు తీసుకుని రైతులకు నేరుగా అమ్మకూడదు. కానీ



మోసపూరిత కంపెనీల పేరిట ఉత్పత్తులను రైతులకు నేరుగా అంటగడుతున్నారు. తమకు పన్నులు తగ్గినందున ధర తగ్గించి ఇస్తామని నమ్మబలికి రైతుల నుంచి అడ్వాన్సు తీసుకుని రాత్రికిరాత్రే ఉత్పాదకాలను వాహనాల్లో రైతుల ఇళ్లవద్దకు చేరుస్తున్నారు. వీటిని వాడితే పంటలకు ఎలాంటి ఉపయోగం లేకపోగా ప్రశ్నిద్దామంటే స్థానికంగా విక్రయదారుగానీ, దుకాణంగానీ ఉండనందున రైతులు పూర్తిగా నష్టపోతున్నారు.

వ్యవసాయశాఖ అనుమతిగల దుకాణం లేనందున సదరు ఎరువులు, పోషకాల శాంపిళ్లను తీసి పరీక్షకు పంపలేకపోతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పోషకాల పేరిట ఇస్తున్న సంచుల్లో చెక్కపొట్టు, పూడిక మట్టి, రసాయనాలను కలిపి రైతులకు అంటగడుతుంటారు. వీటిని వాడినపుడు పొలాల్లోని నీరు రంగుమారటం తప్పితే ఎలాంటి ఫలితం ఉండదు. రైతుబంధు కమిటీలు, రైతుసంఘాలు, ఏఈవోలు, అభ్యుదయ రైతులను అప్రమత్తం చేసి నకిలీల అమ్మకాలను అరికట్టాలి. రాష్ట్రప్రభుత్వం పేర్కొంటున్నట్లు నకిలీ ఉత్పత్తులను అమ్మినవారిపై పీడీ చట్టాన్ని ప్రయోగించాలి.

నేరుగా ఉత్పాదకాలను కొనవద్దు

అన్ని పంట ఉత్పాదకాలను వ్యవసాయశాఖ అనుమతిగల దుకాణాల్లోనే బిల్లులపై కొనాలి. గ్రామాల్లో బిల్లులు లేకుండా నేరుగా జీరోగా విక్రయించే వాటిని కొనవద్దు. పల్లెల్లో విక్రయాలపై తగిన సమాచారమిస్తే పట్టుకుని వారిపై పోలీసుల ద్వారా కేసులు నమోదు చేయిస్తాము. పి.సురేశ్‌కుమార్, డీఏవో

# పడకేసిన ఆసుపత్రుల పాలన

సిరిసిల్ల : జిల్లా జనరల్ ఆసుపత్రిలో కీలకమైన సూపరింటెండెంట్ పోస్టు మూడు నెలలుగా ఖాళీగా ఉంది. సెప్టెంబరులో వైద్య కళాశాల ప్రారంభంతో జిల్లా ఆసుపత్రి పూర్తిగా వైద్య కళాశాల పరిధిలోకి వెళ్లింది. ఆసుపత్రిలో ఆయా విభాగాల్లో పరిపాలన పరమైన సేవలను పర్యవేక్షించడం ఇబ్బందిగా మారింది. వాస్తవానికి వైద్య కళాశాలలోని సీనియర్ వైద్యులకు సూపరింటెండెంట్ బాధ్యతలు అప్పగిస్తారు. కానీ సీనియర్లు ఎవరూ వైద్య సేవలు మినహా పరిపాలన పరమైన బాధ్యతలు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. పాత సూపరింటెండెంట్ వైద్య విధాన పరిషత్తు పరిధిలోని ఆసుపత్రుల కోఆర్డినేటరు (డీసీహెచ్ఎస్)గా నియమితులయ్యారు. జిల్లా ఆసుపత్రిలో కొత్త వారు బాధ్యతలు తీసుకోకపోవడంతో వైద్య కళాశాల ప్రిన్సిపల్‌కు సహాయంగా ఇక్కడే ఉంటున్నారు. దీంతో అటు డీసీహెచ్ఎస్ విధులు కూడా ముందుకు సాగడం లేదు. గత నెల సీనియర్ గైనకాలజిస్టుకు ప్రభుత్వం సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరుసటి రోజే అనారోగ్య సమస్యలు, వ్యక్తిగత కారణాలతో వీఆర్‌కు అనుమతినివ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. ఆర్థోపెడిక్ విభాగంలోని మరో వైద్యుడు తాను జిల్లా వైద్య కళాశాలలో విధుల్లో చేరే ముందే వైద్య సేవలు మినహా పరిపాలన విభాగంలో పని చేయననే ఒప్పందంతో వచ్చారు. జిల్లా ఆసుపత్రిలో నెలకొన్న సూపరింటెండెంట్ నియామకం ప్రక్రియ డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) దృష్టికి వెళ్లింది.

సేవల వికేంద్రీకరణ



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరైన వైద్య సేవలు అందుబాటులో లేక జిల్లా ఆసుపత్రిపై భారం పెరుగుతోంది. జిల్లా జనరల్ ఆసుపత్రికి వచ్చే వారికి ఖర్చులు, వసతికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో జిల్లాలోని పలు మండల కేంద్రాల్లోని ఆసుపత్రుల్లో వైద్య సేవలను బలోపేతం చేసేందుకు పలు విడతల్లో వాటిని సీహెచ్‌సీలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, పోత్గల్, ఇల్లంతకుంట పీహెచ్‌సీలను 50 పడకల ఆసుత్రులుగా స్థాయి పెంచారు. ఒక్క వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. మిగతా వాటిలో వైద్యులు, సిబ్బంది నియామకంతోపాటు వివిధ రకాల వైద్య సేవలను విస్తరించాలి. దీనికోసం జిల్లాలో ప్రత్యేకంగా డీసీహెచ్ఎస్ కార్యాలయం ఏర్పాటుతోపాటు అందులో పని చేసేందుకు కార్యాలయ సిబ్బందిని నియమించాలి. జిల్లా ఆసుపత్రిలోని సూపరింటెండెంట్ నియామకం జరగకపోవడంతో డీసీహెచ్ఎస్ విభాగం పనులన్నీ పెండింగ్‌లో పడ్డాయి. జిల్లాలోని సామాజిక, ప్రాంతీయ ఆసుపత్రులకు వచ్చే రోగుల తాకిడికి తగ్గట్టుగా వైద్యులు, ఇతర విభాగాల్లోని సిబ్బంది, మానవ వనరులను నియమించకపోవడంతో అరకొర వైద్య సేవలే అందుతున్నాయి. ప్రజారోగ్య వ్యవస్థను చక్కదిద్దాలంటే ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకూ అన్ని స్థాయిల్లోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాల్సిన అవసరముంది.

# యశస్వి.. భవితకు దిక్సూచి

భువనగిరి : పాఠశాల విద్యార్థులు పరీక్షలు ముగిశాయి. తాజాగా ప్రగతి పత్రాలను కూడా అందుకున్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. సెలవుల్లో చదువుకు సానబెట్టి ప్రతిభ చూపి ఉపకార వేతనం పొంది ఆర్థిక అవసరం తీర్చుకునే మంచి తరుణం ఇది. 'పీఎం యశస్వి' ఉపకార వేతన పథకం పేర కేంద్ర సర్కారు గతేడాదే రూపకల్పన చేసింది. యశస్వి అంటే 'యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు స్కీమ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా'. ఇప్పటి వరకు ఉన్న అతిపెద్ద ఉపకార వేతన పథకాల్లో ఇది కూడా ఒకటి. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారిక మంత్రిత్వ శాఖ పరిధిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో ఈ పథకం నడుస్తుంది. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 1100 ఉన్నత పాఠశాలలుంటే ఎనిమిది, తొమ్మిది, పదోతరగతిని ఇటీవలనే పూర్తి చేసుకున్నవారు సుమారు 82,273 మంది విద్యార్థులున్నారు.

అర్హులు ఎవరంటే..? విద్యార్థి భారతీయుడై ఉండి, కేంద్ర విద్యాశాఖ అధికారిక ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో నిర్వహించే యశస్వి ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలి. ప్రవేశ పరీక్ష రాసేందుకు ఎనిమిదో తరగతి పూర్తయి ఉండాలి. 9, 10 తరగతులు పూర్తయినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వారికి మిగిలిన సంవత్సరాలకు (ఇంటర్ వరకు) మాత్రమే ఉపకార వేతనం లభిస్తుంది. సదరు విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 2.5 లక్షలకు మించొద్దు. గ్రామాల్లోని నిరుపేదలు, రైతులు, అణగారిన కుటుంబాల్లోని విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తారు.



దరఖాస్తు ఇలా చేయాలి...

ప్రవేశ పరీక్ష రాసేందుకు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో పేరు నమోదు కావాలి. పేరు, ఈ- మెయిల్ అడ్రస్, పుట్టిన తేదీ, పాస్‌వర్డ్ తదితరాలతో ఓ ఖాతాను క్రియేట్ చేసుకోవాలి. తర్వాత దరఖాస్తుదారుడికి అప్లికేషన్ నంబర్ వస్తుంది. అదే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తో లాగిన్ కావాలి. చదువు, గుర్తింపుకార్డు తదితర వివరాల డాక్యుమెంట్ల సాఫ్ట్‌కాపీలను అప్‌లోడ్ చేసి సైన్‌అప్ కావాలి. అంతటితో దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది. పరీక్ష, ప్రవేశకార్డు జారీచేసే తేదీ తదితర వివరాలను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాల్సి ఉంటుంది.

పరీక్ష ఈ విధంగా..ఎంపిక చేసిన కేంద్రాల్లో మూడు గంటలపాటు కొనసాగే పరీక్షలను హిందీ, ఇంగ్లిషు భాషల్లో నిర్వహిస్తారు. ఎలాంటి పరీక్ష రుసుం ఉండదు. పత్రంలో వంద బహుళ ఐచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. గణితంలో 120 మార్కుల కోసం 30 ప్రశ్నలు, సైన్స్‌లో 80 మార్కులకు 20 ప్రశ్నలు, జనరల్ అవేర్‌నెస్‌లో 100 మార్కులకు మరో 25 ప్రశ్నలుంటాయి. దేశ వ్యాప్తంగా సుమారు 78 నగరాల్లో ఈ పరీక్షలు జరుగుతాయి. గతేడాది సెప్టెంబరు 11న పరీక్షలు నిర్వహించారు. ఏప్రిల్ 15 నుంచి ఈ ఏడాది నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఆగస్టు 26తో దరఖాస్తు గడువు పూర్తి కానుంది.

అర్హత సాధించిన అనంతరం..9, 10 తరగతులకు ఏటా రూ.75 వేలు, ఇంటర్మీడియట్ లేదా 11, 12 తరగతులకు ఏటా రూ.1.25 లక్షలు ఉపకార వేతనం ఒకేసారి సంబంధిత ఖాతాలో జమ చేస్తారు. ఇందుకు ఎంపికైన విద్యార్థులు ఉపకార వేతనం కోసం తిరిగి అదే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఏ బ్యాంకు ద్వారా పొందాలనుకుంటున్నారో ఆ బ్యాంకు పాసుపుస్తకం ఫొటోకాపీని జతచేయాలి. ఉపకారవేతనం నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. వీటితో కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏ పాఠశాల, కళాశాలలో అయినా విద్యార్థులు విద్యను అభ్యసించవచ్చు. ఆ పాఠశాలల వివరాల లింకు కూడా ఆ వెబ్‌సైట్‌లో ఉంటుంది.

# ఆరంభ శూరత్వమే.. నిర్వహణ అంతంత మాత్రమే

నల్గొండ : గ్రామాలను పరిశుభ్రంగా మార్చాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రత్యేక కార్యాచరణతో ప్రతి పల్లెలో ప్రజారోగ్యంతో పాటు పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరేలా చెత్తశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసింది. గ్రామ పంచాయతీల్లో ఇంటింటి నుంచి పోగవుతున్న వ్యర్థాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వాటి ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేసి పంచాయతీకి సంపద సమకూర్చాలని ప్రభుత్వం భావించింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రతి పల్లెలో చెత్త డంపింగ్‌యార్డులు ఏర్పాటు చేసినప్పటికి స్థానిక అధికారుల నిర్లక్ష్యం మూలంగా ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోంది.

నిర్వహణ అస్తవ్యస్తం

ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన చెత్తశుద్ధి కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పల్లెల్లో పోగైన వ్యర్థాలను డంపింగ్ యార్డులకు తరలించి చెత్తను తడి,పొడిగా వేరు చేసి ఎరువుగా మార్చాల్సిన సిబ్బంది వాటిని దహనం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. దీంతో పరిసర ప్రాంతమంతా పొగతో నిండిపోతోంది. మరికొన్ని గ్రామాల్లో పూర్తిగా వ్యర్థాలను చెత్త శుద్ధి కేంద్రాలకు తరలించకుండానే వాగులు, వంకల్లో పారబోస్తున్నారు. కొన్ని గ్రామాల్లో చెత్తను సేకరిస్తున్నట్లు స్థానిక అధికారులు లెక్కలు చూపిస్తు ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇంకొన్ని పంచాయతీల్లో రైతులు పశువుల పాకగా మార్చుకుంటున్నారు. దీంతో రూ.కోట్ల నిధులతో నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి. కనగల్ మండలం చర్ల గౌరారం గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త శుద్ధి కేంద్రం (వర్మికంపోస్టు షెడ్డు) ఇది. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రూ.లక్షల వ్యయం చేసి నిర్మించిన షెడ్డు నిరుపయోగంగా మారింది. షెడ్డు పైభాగం కప్పు గాలికి లేచిపోయింది. అక్కడ చెత్త వేసింది లేదు. ఎరువును తయారు చేసింది లేదు.

వట్టి మాటలే..!

ఒక పక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తమ పంచాయతీలను గుర్తిస్తూ ప్రోత్సహిస్తున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ పేరిట పోటీలు నిర్వహిస్తూ బహుమతులు ప్రదానం చేయడంతో పాటు నిధులు మంజూరు చేస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ పంచాయతీల్లో రాష్ట్రం నుంచి 30 గ్రామాలు ఎన్నికవగా.. అందులో ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి మహిళా విభాగంలో ఏపూరు గ్రామపంచాయతీ ఎన్నికైంది. మరి పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం, చెత్తశుద్ధి, సేంద్రియ ఎరువు తయారీలో వెనుకంజలో ఉన్నాం. ప్రభుత్వం ఆశించిన మాదిరిగా పల్లెల్లో పోగవుతున్న వ్యర్థాలను శుద్ధి చేసే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

# అక్రమ డిప్యుటేషన్లకు ఆశ్రమం




కొత్తగూడెం : భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ విద్యాలయాల్లో ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్ల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ప్రాజెక్టు అధికారి గౌతమ్ పోట్రుకు తెలియకుండా డీడీ రమాదేవి, మరో అధికారితో కలిసి పలువురు ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌పై కావాల్సిన చోట పోస్టింగ్ తెచ్చుకున్నారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో పీఓ ఆగ్రహం వెలిబుచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో ఎంతమంది? ఎక్కడెక్కడ డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారో నిగ్గు తేల్చాలని ఈ నెల 25న త్రిసభ్య కమిటీని నియమించారు. అంతకుముందే ఆయన స్థానిక తహసీల్దార్లతో విచారణ జరిపించి అక్రమ డిప్యుటేషన్లు జరిగింది వాస్తవమేనని నిర్ధారించుకున్నారు.

త్రిసభ్య కమిటీ నియామకం

2022-23 విద్యా సంవత్సరంలో సంక్షేమాధికారుల అక్రమ డిప్యుటేషన్లు గుర్తించిన పీఓ ఇటీవల వాటిని రద్దు చేశారు. ఇదే సమయంలో గత ఐదు నెలల్లో కొందరు ఉపాధ్యాయులకు డీడీ, మరో అధికారి నోటి మాటలతో కోరిన పోస్టింగులు ఇప్పించారు. ఉన్నతాధికారులు కావడంతో హెచ్.ఎం.లు ఉత్తర్వుల్లేకున్నా ఆదేశాలు పాటించారు. జిల్లాలో 39 విద్యాలయాలుండగా ఇప్పటివరకు 22 మంది అక్రమంగా డిప్యుటేషన్లు పొందినట్లు పీఓ విచారణలో తేలింది. సుమారు మరో 18 మంది అడ్డదారిలో ప్రయోజనం పొంది ఉండొచ్చని అంచనా. విషయం తెలిసిన వెంటనే తహసీల్దార్లను విద్యాలయాలకు పంపి కూపీ లాగించిన పీఓ, ఆ తర్వాత త్రిసభ్య కమిటీని నియమించారు. ఈఅంశంపై విచారణ జరుగుతోందని, తానేమీ మాట్లాడనని డీడీకు తెలిపారు.

'హెచ్.ఎం.ల సమావేశం అనంతరం ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్లపై పీఓ కమిటీ నియమించారు. విద్యాలయాల ప్రధానోపాధ్యాయుల నుంచి అన్ని విషయాలు తెలుసుకుంటున్నాం. పదుల సంఖ్యలో ఉపాధ్యాయులు అక్రమ డిప్యుటేషన్లపై పనిచేస్తున్నట్లు తేలింది. వారికి వేతనాలు ఎలా చెల్లించారు? ఎవరు నియామకం చేయమన్నారో రాతపూర్వకంగా తెలుసుకుంటున్నాం. అనంతరం పీఓకు నివేదిక అందజేస్తాం.' దేవిడ్‌రాజ్, త్రిసభ్య కమిటీ ఛైర్మన్, ఐటీడీఏ ఏపీఓ

# బస్తీ దవాఖానాలకు సుస్తీ!



ఇల్లెందు : బస్తీ దవాఖానాల పనులు ముందుకు సాగడం లేదు. ప్రతి 10 వేల మందికి ఒక బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయించి తదనుగుణంగా చర్యలు చేపట్టింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని పురపాలికల పరిధిలో బస్తీ దవాఖానాలు ఆశించిన స్థాయిలో వినియోగంలోకి రావడం లేదు. నేటికి వైద్యశాలలకు స్థలాలు కేటాయించకపోవడం, భవనాల మరమ్మతులు, పూర్తయిన దవాఖానాల్లో వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడం తదితర సమస్యలు వెంటాడుతున్నాయి.

దశల వారీగా ఏర్పాటు చేస్తున్నాం

శిరీష, డీఎంహెచ్ఓ, భద్రాద్రి

పురపాలికల పరిధిలో దశల వారీగా బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నాం. దవాఖానాల నిర్మాణం పూర్తయిన వాటిలో వైద్యులు, సిబ్బందిని నియమించి సేవలందిస్తున్నాం. త్వరలో మిగిలిన దవాఖానాలు పూర్తి చేస్తాం. దవాఖానాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

పురపాలికల్లో ఇదీ పరిస్థితి...కొత్తగూడేనికి రెండు బస్తీ దవాఖానాలు మంజూరు చేశారు. ఒకటి పూర్తయి వైద్యసేవలు అందిస్తోంది. మరొక దవాఖానా నిర్మాణ దశలో ఉంది.

పాల్వంచలో ఒక బస్తీ దవాఖానా ఏర్పాటు చేసి వైద్యులు, సిబ్బందిని నియమించారు.ఇల్లెందుకు రెండు బస్తీ దవాఖానాలు మంజూరు చేశారు. ఆర్అండ్ఆర్ కాలనీలో ఒకటి పూర్తయింది. 3వ వార్డులో మరో దవాఖానా ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయి. పూర్తయిన దవాఖానాలో వైద్యులు, సిబ్బందిని నియమించలేదు. మణుగూరులో బస్తీ దవాఖానా అవసరం ఉన్నప్పటికీ కనీసం ఒక్కటి కూడా మంజూరు కాలేదు. మధిరలోని మడుపల్లి ఏరియాలో ఒక బస్తీ దవాఖానా ఏర్పాటు చేసి వైద్యులు, సిబ్బందిని నియమించారు. సత్తుపల్లికి మూడు బస్తీ దవాఖానాలు మంజూరు చేశారు. అందులో రాజీవ్‌కాలనీలో నిర్మించిన దవాఖానాలో వైద్యులు, సిబ్బంది నియమించారు. ఇంకా రెండు బస్తీ దవాఖానాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. వైరాకు కనీసం ఒక్క బస్తీ దవాఖానా కూడా మంజూరు చేయకపోవడం గమనార్హం.

# వీడని వర్షాలు.. అన్నదాతకు తీరని కష్టాలు

వరంగల్ : అన్నం పెట్టే అన్నదాతకు అడుగడుగునా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. సమస్యలను ఎదుర్కొని సాగు చేసిన పంట చేతికొచ్చే వేళ కురుస్తున్న అకాల వర్షాలు వారి బతుకులను చిదిమేస్తున్నాయి. యాసంగిలో వేసిన వరి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జిల్లాలోని 13 మండలాల్లో నర్సంపేట డివిజన్‌లోని ఆరు మండలాలతో పాటు పర్వతగిరి, సంగెం, వర్ధన్నపేట మండలాల్లో పంటలు దెబ్బతినగా కొన్ని చోట్ల మామిడి కాయలు రాలి నష్టాలను మిగిల్చాయి. జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా కురిసిన ఈదురుగాలుల వానకు వరి, మొక్కజొన్న చేన్లు కలిపి 10వేల ఎకరాల్లో నష్టం వాటిలినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని మండలాల్లో పంట నష్టంపై క్షేత్రస్థాయిలో సర్వే చేసి 30 శాతం దెబ్బతిన్న పంటలను సేకరించనున్నట్లు ఓ అధికారి తెలిపారు. రెండేళ్లుగా ఇదే పరిస్థితి..ప్రకృతి ప్రకోపానికి రెండేళ్లుగా పూర్తిగా పంటలను కొల్పోతున్నారు. వరుసగా దెబ్బ మీద దెబ్బ తగలడంతో హాలదారులు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోతున్నారు. 2022 జనవరి 12న రాత్రి ఈదురు గాలులతో పెద్ద ఎత్తున వడగండ్లు కురవడంతో జిల్లాలో దుగ్గొండి, నల్లబెల్లి, నర్సంపేట, ఖానాపురం మండలాల్లో పలు గ్రామాల్లో మిర్చి, మొక్కజొన్న పంటలు మట్టి కొట్టుకుపోయాయి. ఈసారైనా కలసి వస్తుందనుకుంటే గత మార్చి 18న ఈదురు గాలులతో భారీగా కురిసిన అకాల వర్షానికి దుగ్గొండి, చెన్నారావుపేట, నర్సంపేట, ఖానాపురం, నల్లబెల్లి మండలాల్లో మిర్చి, మొక్కజొన్న, వరి పంటలు బాగా దెబ్బతిన్నాయి.

మార్కెట్‌కు తెస్తే కొట్టుకుపోయాయి

ఆరుగాలం శ్రమిస్తే అరకొరగా పండిన మొక్కజొన్నలను అమ్మడానికి మార్కెట్ యార్డుకు తెచ్చి కుప్పలు పోస్తే.. అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షానికి పలువురి రైతుల మక్కలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. నోటిదాకా వచ్చిన పంట కళ్లెదుటే నీటి పాలైతే ఏంచేయాలో దిక్కుతోచని స్థితిలో గుండెలు బాదుకుంటూ బాధిత రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు చాపల మధు, చెన్నారావుపేట మండలం ఖాదర్‌పేట. ఎకరంన్నర భూమిలో మొక్కజొన్న పంట వేశాడు. చేతికి వచ్చిన పంట అకాల వర్షానికి పూర్తిగా నేలపాలైంది. కంకి పూర్తిగా తడిసి చేతికి రాకుండా పోయిందని, రూ. 30వేల నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీటిలో తడిసిన వరిని చూపుతున్న రైతు రాదారపు నరేశ్‌బాబు, నల్లబెల్లి మండలం కొండాయిలుపల్లి. సొంత భూమికి తోడు రెండెకరాలు కౌలుకు తీసుకొని ఐదెకరాల్లో వరి, మొక్కజొన్న వేశారు. ఆది, మంగళవారం రాత్రి కురిసిన వానకు వరి, మొక్కజొన్న నేలవాలి పనికి రాకుండా పోయింది. వ్యవసాయాధికా రులు పంట నష్టంపై సర్వే చేయడానికి రావట్లేదు. ఎంత తేడా? చెన్నారావుపేట మండలం అక్కల్‌చెడ గ్రామానికి చెందిన రైతు కోరే రమేశ్ నాలుగెకరాల్లో వరి సాగు చేయగా, పైరు ఏపుగా పెరిగి దట్టంగా వరి కంకులు వేసింది. మంచి దిగుబడి వస్తుందని మురిసి పోయాను. రెండ్రోజుల క్రితం కురిసిన వడగండ్ల వానకు 70 శాతం గింజలు రాలిపోయాయి.

అప్పు మిగిలింది..- వీరన్న, రాములునాయక్‌తండా, నర్సంపేట

మహేశ్వరం శివారులో ఎనిమిదెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. మూడెకరాల్లో పంట దెబ్బతిన్నగా, పెట్టుబడి కోసం తెచ్చిన అప్పు మిగిలింది. గతేడాది కురిసిన వడగండ్లకు రూ.లక్ష వరకు నష్టపోయాను.

పైసా పరిహారం ఇవ్వలేదుగద్దె సారయ్య, నల్లబెల్లి

నాలుగెకరాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. నిరుడు ఇదే పరిస్థితి. ఈ ఏడాది కలిసి వస్తుందనుకుంటే మళ్లీ కష్టాలు, కన్నీళ్లనే మిగిలాయి. లక్షల రూపాయల్లో నష్టం జరిగింది. వడగండ్ల వానతో నష్టపోయిన మామిడి రైతులకు ప్రభుత్వం గతంలో పైసా పరిహారం ఇవ్వలేదు.

క్షేత్రస్థాయిలో సర్వే చేస్తాం- ఉషాదయాల్, జిల్లా వ్యవసాయాధికారి, వరంగల్‌అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టంపై క్షేత్రస్థాయిలో సర్వే చేసి వివరాలు సేకరిస్తాం. ఇప్పటికే తమశాఖ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో సందర్శించి వివరాల సేకరిస్తున్నారు. ప్రాథమికంగా 10 వేల ఎకరాల్లో నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

# సమయం సద్వినియోగం.. మెదడు ఉత్తేజభరితం

మిర్యాలగూడ : విద్యార్థులకు వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. .ఇన్నాళ్లూ నిత్యం పాఠశాలకు వెళ్తూ..పుస్తకాలతో కుస్తీ పట్టిన చిన్నారులు.. సెలవుల్లో ఏం చేయాలి.. సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియక తల్లిదండ్రులు తికమక పడుతుంటారు. నిత్యం ఆటలతోనే సమయం గడిపితే..సెలవుల అనంతరం చేతికి రారేమో అన్న ఆందోళన సైతం తల్లిదండ్రుల్లో ఉంటుంది. చదువుకు సంబంధించిన, శారీరక క్రీడల శిక్షణతో పాటు మెదడుకు మేత పెట్టేలా పలు క్రీడల్లో తర్ఫీదు పొందేందుకు చిన్నారులకు అవకాశం ఇవ్వాలి. మెదడును ఉత్తేజ పరిచే క్రీడల్లో సైతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాల్లోనూ వేసవి శిబిరాలు ఏర్పాటు కానున్నాయి. శిబిరాలు అందుబాటులో లేనివారు అంతర్జాల తరగతులను సద్వినియోగం చేసుకోవచ్చు.

రూబిక్ క్యూబ్‌తో మెదడుకు మేత..

'జులాయి' సినిమాలోని ఓ దృశ్యంలో హీరో అల్లు అర్జున్ రూబిక్ క్యూబ్‌ను క్షణాల్లో పరిష్కరిస్తాడు. అయితే మనం ఎంత ప్రయత్నించినా దాన్ని పరిష్కరించడానికి ఎంతో సమయం పడుతుంది. దీనిని పరిష్కరించడానికి ఎంతో ఏకాగ్రత కావాలి. ప్రస్తుతం ప్రతి జాతరలో, కిరాణం దుకాణంలో లభించే రూబిక్‌ను అందరూ కాలక్షేపానికి ఆడుతా రు కానీ..దీని వల్ల మెదడు ఉత్తేజ భరితం కావడంతో పాటు ఏకాగ్రత, ఓపిక, జ్ఞాపకశక్తి, ఐక్యూ స్థాయి సైతం పెరుగుతుంది. కేవలం నగరాలకే పరిమితమైన రూబిక్ క్యూబ్‌లో శిక్షణను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక్క మిర్యాలగూడలోనే లఘువరపు శిల్ప గత మూడేళ్లుగా వేసవి సెలవుల్లో చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. సుమారు 400



పైగా రకాలున్న రూబిక్ క్యూబ్‌లో 40 రకాల్లో తాను శిక్షణ ఇస్తున్నట్లు శిక్షకురాలు శిల్పకు తెలిపారు.

పిల్లల కోసం ఓ వనం..


సెలవుల్లో చిన్నారులు కేవలం ఆటలకే పరిమితం కాకుండా సాహిత్యం వైపు సైతం దృష్టి సారించాలని మిర్యాలగూడకు చెందిన సాహిత్య అభిమాని పొన్నూరు కిరణ్మయి సూచిస్తున్నారు. సాహితీవేత్తలైన తన స్నేహితుల సహకారంతో తన ఇంట్లోనే చిన్నారుల కోసం 'విస్మయి బాల వికాస వనం' పేరుతో సాహితీ కేంద్రాన్ని స్థాపించారు. ఇందులో చిన్నారుల కోసం ప్రత్యేకంగా గ్రంథాలయం ఏర్పాటు చేశారు. చిన్నారులు తమకు నచ్చిన కథల పుస్తకాలు, నవలలు చదవడంతో పాటు చిత్రాలు గీయవచ్చు. దీంతో పాటు క్యారమ్, చదరంగం వంటి ఆటలు సైతం ఆడవచ్చు. దీంతో పాటు చిన్నారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు వారితో కథలు రాయించడం, పాటలు పాడించడం, చిత్రలేఖన వంటి పోటీలు సైతం నిర్వహిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. ఇటువంటి కేంద్రాలు లేని ప్రాంతాల వారు సైతం మంచి కథల పుస్తకాలను తీసుకొచ్చి ఈ సెలవుల్లో చిన్నారుల చేత చదివిస్తూ వారితో కథలు అలవాటు చేయించాలని కిరణ్మయి సూచిస్తున్నారు.

చదరంగంలో తర్ఫీదు..

అంతర్జాతీయంగా మంచి పేరున్న మెదడు ఆధారిత క్రీడల్లో చదరంగం మొదటిది. వేసవి సెలవుల్లో పలు పట్టణాల్లో ప్రత్యేక శిక్షణ శిబిరాలు సైతం ఏర్పాటు చేస్తుంటారు. ఈ శిబిరాలు మే ఒకటో తారీఖు నుంచి ప్రారంభం కానున్నాయి. చిన్నారులను నెల రోజుల పాటు చదరంగంలో శిక్షణ ఇప్పించడం ద్వారా అనేక అద్భుతాలు జరుగుతాయని మిర్యాలగూడకు చెందిన చదరంగం అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మాశెట్టి శ్రీనివాస్ చెప్తున్నారు. చదరంగం నేర్చుకోవడం ద్వారా మేథస్సుతో పాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి సైతం పెరుగుతాయని..జిల్లాలో అనేక మంది కొద్ది రోజుల శిక్షణ తోనే అనేక మంది చిన్నారులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతున్నారన్నారు. వేసవి సెలవుల్లో చిన్నారులు ఏ క్రీడలో శిక్షణ పొందుతున్నప్పటికీ చదరంగంలోనూ శిక్షణ ఇప్పించాలని శ్రీనివాస్ సూచిస్తున్నారు.

# ఆధార్ నమోదు మూత.. జనాల వెత

యాదగిరిగుట్ట :యాదగిరిగుట్ట తహసీల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రం కొన్ని రోజులుగా మూత వేయడం, సేవలు అందకపోవడంతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. నేటి కాలంలో ప్రతీదానికి ఆధార్‌కార్డు తప్పనిసరిగా మారింది. కొత్త కార్డులు, సవరణలు, చరవాణి సంఖ్య అనుసంధానం చేయడం, మార్పులు వగైరా పనుల కోసం ప్రభుత్వ అనుబంధ రంగ సంస్థల ద్వారా ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐతే నమోదు కేంద్రం మూత ఉండటం, జనాలకు సేవలందక వెనుతిరిగి పోతున్నారు.



వృద్ధులు, పిల్లలు, తల్లులు, దివ్యాంగులకు చాలా ఇబ్బందిగా మారింది. ఎందుకు మూతబడి ఉన్నదనే విషయంపై తహసీల్దారు శోభన్‌బాబు, నిర్వాహకులను వివరణ కోరగా ఆ కేంద్రం ఐడీని ప్రభుత్వం బ్లాక్ చేసినట్లుగా తెలిసింది. సేవల్లో లోపాలు, పారదర్శకత లేకుంటే ఇలా ఐడీని బ్లాక్ చేస్తారని తెలిపారు. ఐతే కేంద్ర ప్రభుత్వమే ప్రభుత్వ సంస్థల ద్వారా ఈ సేవలందించడానికి కావాలని ఈ ఆధార్ నమోదు కేంద్రాలను బ్లాక్ చేస్తున్నట్లుగా ఆరోపణలు వినబడుతున్నాయి. దీనిపై నిర్వాహకులు ఆందోళనలకు సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే తపాలా కార్యాలయం, ఎస్‌బీఐ ద్వారా ఆధార్ సేవలు ప్రారంభమయ్యాయి. చాలా మందికి తెలియక తికమకపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఆధార్ నమోదు కేంద్రాలపై ఏదో ఒక స్పష్టత నివ్వాలని, జనాలను ఇబ్బందులు పెట్టవద్దని కోరుతున్నారు.




దిల్లీ: ఆర్థిక వృద్ధి విషయంలో భారత్‌ను పదేపదే చైనాతో పోల్చడాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వ్యతిరేకించారు. ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. మన పొరుగున ఉన్న చైనా ప్రజాస్వామ్య దేశం కాదని, అక్కడ నియంతృత్వ పాలన ఉందని విమర్శించారు. ఈ సందర్భంగా దేశంలో నిరుద్యోగం, అవినీతి, పాలనాపరమైన అడ్డంకులు, నైపుణ్యాల అంతరం ఉందంటూ వ్యక్తమవుతున్న ఆందోళనలను కూడా ప్రధాని తోసిపుచ్చారు. "ఆర్థిక వృద్ధి గురించి మాట్లాడేటప్పుడు భారత్‌ను చైనాతో పోల్చడం సరికాదు. దిల్లీని ఇతర ప్రజాస్వామ్య దేశాలతో పోలిస్తే మరింత సముచితంగా ఉంటుంది. ఎందుకంటే మా పొరుగు దేశంలో ప్రజాస్వామ్య పాలన లేదు" అని మోదీ వ్యాఖ్యానించారు. ఇక, అవినీతి, నిరుద్యోగం వంటి సవాళ్లే ఉంటే.. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ గుర్తింపు సాధించేది కాదని అన్నారు. "ప్రపంచ స్థాయి కంపెనీల్లో భారత సంతతి వ్యక్తులు సీఈవో హోదాల్లో ఉన్నారు. భారత్‌లో నైపుణ్యాల అంతరం లేదని చెప్పేందుకు ఇదే సరైన ఉదాహరణ" అని మోదీ తెలిపారు. విదేశీ కంపెనీలను ఆకర్షించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పెట్టుబడులకు అనుకూలమైన పరిస్థితులను కల్పిస్తోందని ప్రధాని ఈ సందర్భంగా వెల్లడించారు. తద్వారా ప్రపంచ స్థాయి కంపెనీలు భారత్‌లో తమ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇదే ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ పలు కీలక అంశాల గురించి ప్రస్తావించిన విషయం తెలిసిందే. భారత్‌లో మైనార్టీలను అణచివేస్తున్నారన్న విమర్శలపై ఆయన స్పందిస్తూ.. "వివిధ రకాల వేదికలపై విమర్శకులు(విపక్షాలు) తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వెల్లడిస్తారు. అలాంటప్పుడు ఆరోపణలకు సమాధానం చెప్పి.. వాటిని ఖండించే హక్కు అవతలి పక్షానికి ఉంటుంది" అని మోదీ తెలిపారు.

# చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా




అమరావతి: ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు పూర్తి కావడంతో లిఖితపూర్వక వాదనలు ఇవ్వాలని ఏపీ హైకోర్టు సూచించింది. చంద్రబాబు తరపున న్యాయవాదులు ఈ రోజు ఉదయం లిఖితపూర్వక వాదనలను కోర్టులో దాఖలు చేశారు. మధ్యాహ్నం సీఐడీ తరపున లిఖితపూర్వక వాదనలను కోర్టుకు అందించినట్లు సీఐడీ తరపు న్యాయవాదులు తెలిపారు. ఇరు పక్షాల లిఖితపూర్వక వాదనలను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు కేసు విచారణను రేపటికి వాయిదా వేసింది. కాగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌పై విజయవాడ ఏసీబీ కోర్టులో సీఐడీ మరో పిటిషన్ దాఖలు చేసింది. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో లోకేశ్‌కు ఎన్‌బీడబ్ల్యూ జారీచేయాలని, ఈ కేసులో ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఐఆర్ఆర్ కేసులో 41ఏ నోటీస్ నిబంధనలను లోకేశ్ ఉల్లంఘించారని ఆరోపించింది. సాక్ష్యాలు ఏమిటని న్యాయమూర్తి ప్రశ్నించగా .. పత్రికల క్లిప్పింగ్‌లను సీబీఐ తరపు న్యాయవాది చూపించారు. లోకేశ్‌ను అరెస్టు చేసేందుకు అనుమతి ఇవ్వాలని, రెడ్ బుక్ పేరుతో అధికారులను లోకేశ్ బెదిరిస్తున్నారని పిటిషన్‌లో పేర్కొంది. 41ఏ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునే అధికారం కోర్టుకు ఉందని పిటిషన్‌లో సీఐడీ పేర్కొంది. కాగా ఈ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు జడ్జి శుక్రవారం సాయంత్రం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో లోకేశ్‌పై సీఐడీ ఇప్పటికే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో లోకేశ్ ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించగా 41ఏ నోటీసు ఇచ్చి విచారించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో లోకేశ్‌కు ఇప్పటికే 41ఏ నోటీసులు జారీ అయిన విషయం తెలిసిందే.

# విజయవాడ ఏసీబీ కోర్టులో లోకేశ్‌పై సీఐడీ మరో పిటిషన్




విజయవాడ: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌పై విజయవాడ ఏసీబీ కోర్టులో సీఐడీ మరో పిటిషన్ దాఖలు చేసింది. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో లోకేశ్‌కు ఎన్‌బీడబ్ల్యూ జారీచేయాలని, ఈ కేసులో ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఐఆర్ఆర్ కేసులో 41ఏ నోటీస్ నిబంధనలను లోకేశ్ ఉల్లంఘించారని ఆరోపించింది. సాక్ష్యాలు ఏమిటని న్యాయమూర్తి ప్రశ్నించగా .. పత్రికల క్లిప్పింగ్‌లను సీబీఐ తరపు న్యాయవాది చూపించారు. లోకేశ్‌ను అరెస్టు చేసేందుకు అనుమతి ఇవ్వాలని, రెడ్ బుక్ పేరుతో అధికారులను లోకేశ్ బెదిరిస్తున్నారని పిటిషన్‌లో పేర్కొంది. 41ఏ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునే అధికారం కోర్టుకు ఉందని పిటిషన్‌లో సీఐడీ పేర్కొంది. కాగా ఈ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు జడ్జి శుక్రవారం సాయంత్రం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో లోకేశ్‌పై సీఐడీ ఇప్పటికే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో లోకేశ్ ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించగా 41ఏ నోటీసు ఇచ్చి విచారించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో లోకేశ్‌కు ఇప్పటికే 41ఏ నోటీసులు జారీ అయిన విషయం తెలిసిందే.

# అప్పులు తీసుకోవడంలో ఆంధ్రప్రదేశ్ టాప్-3: తెదేపా



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నట్లు ఆర్బీఐ నివేదిక చెప్పిందని తెదేపా అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయకుమార్ అన్నారు. అప్పులు తీసుకోవడంలో రాష్ట్రం మన దేశంలోనే టాప్-3లో ఉన్నట్లు ఆయన తెలిపారు. విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విజయకుమార్ మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో అన్ని రాష్ట్రాలు కలిసి ఆర్బీఐ ద్వారా చేసిన రుణాలు 88.4 శాతమైతే.. ఏపీ ఒక్కటే 11.6శాతం అప్పులు చేసిందని ఆయన పేర్కొన్నారు.

" విద్యారంగంలో తెదేపా హయాం కంటే వైకాపా ప్రభుత్వం ఇప్పుడు ఖర్చుపెట్టేది తక్కువ. చదువుకున్నవాళ్లు పెరగడం వల్లే ఉద్యోగాలు ఇవ్వలేకపోతున్నామని మంత్రి బొత్స సత్యనారాయణ అంటున్నారు. ఆరోగ్యశ్రీ కింద ఆస్పత్రులకు నిధులు ఇవ్వడం లేదు. వైద్య రంగంలో మూడేళ్లుగా బడ్జెట్‌లో 5.6శాతం మాత్రమే ఖర్చు పెట్టారు. వైద్య రంగంలో ఎక్కువ బడ్జెట్ ఖర్చు చేసే రాష్ట్రాల్లో ఏపీ 18వ స్థానంలో ఉంది" అని విజయకుమార్ తెలిపారు.




శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో జవాన్లను తరలిస్తున్న రెండు సైనిక వాహనాలపై గురువారం ఉగ్రవాదులు కాల్పులకు తెగబడిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ముష్కరులు కొండల పైనుంచి కాల్పులు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. దాడికి ముందు ఉగ్రవాదులు ఆ ప్రాంతంలో రెక్కీ నిర్వహించినట్లు తెలుస్తోంది. పూంఛ్ జిల్లాలోని ధేరా కి గాలి, బుఫ్లియాజ్ మధ్య గల ధత్యార్ మోర్ వద్ద గురువారం మధ్యాహ్నం 3.45 గంటలకు ఈ దాడి జరిగింది. ఈ మార్గంలో ప్రమాదకరమైన మూలమలుపు (బ్లైండ్ కర్వ్ స్పాట్) ఉంది. దీంతో ఈ ప్రాంతాన్ని ఎంచుకున్న ఉగ్రవాదులు ముందే కొండలపై నక్కారు. ఆ మలుపు వద్ద సైనిక వాహనాలు స్లో అవ్వగానే కొండలపై నుంచి ముష్కరులు కాల్పులకు తెగబడ్డారు. భద్రతా బలగాలు అప్రమత్తమై ఎదురుకాల్పులు జరపగా.. అప్పటికే ముష్కరులు అక్కడి నుంచి పారిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కాల్పుల్లో ఐదుగురు జవాన్లు అమరులయ్యారు. అయితే, దాడికి ముందు ఉగ్రవాదులు ఈ ప్రాంతంలో రెక్కీ చేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ధేరా కి గాలి ప్రాంతంలో ఓ ఆపరేషన్ కోసం అదనంగా సైనికులను తరలిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ముగ్గురు లేదా నలుగురు ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. సైన్యంపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడటం నెల రోజుల వ్యవధిలో ఇది రెండోసారి కావడం గమనార్హం. గత నెల రాజౌరీ జిల్లాలో కూడా ఉగ్రవాదులు ఇలాగే చిన్నపాటి గుహల్లో నక్కి భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు. ఆ ఘటనలో ఇద్దరు యువ కెప్టెన్లు, ముగ్గురు జవాన్లు అమరులయ్యారు.

**ముష్కరుల కోసం వేట..** దాడి జరిగిన ప్రాంతంలో భద్రతా సిబ్బంది కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఉగ్రవాదుల కోసం అటవీ ప్రాంతంలో ముమ్మరంగా గాలిస్తున్నారు. జాగిలాలతో పాటు డ్రోన్లను ఉపయోగించి అన్వేషిస్తున్నారు. అవసరమైతే అదనపు భద్రతా సిబ్బందిని మోహరించి ముష్కరులను పట్టుకుంటామని ఆర్మీ అధికారులు వెల్లడించారు.

ఈ దాడికి తమదే బాధ్యత అని పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తొయిబా అనుబంధ సంస్థ పీపుల్స్ యాంటీ ఫాసిస్ట్ ఫ్రంట్ ప్రకటించుకున్న విషయం తెలిసిందే.

# తెలుగు రాష్ట్రాల్లో 'కొత్త' కరోనా కేసులు



తూర్పుగోదావరి: తెలుగు రాష్ట్రాల్లో 'కొత్త' కరోనా కేసులు కలకలం రేపుతున్నాయి. ఏపీలో తాజాగా రెండు కేసులు నమోదయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో తొలి కోవిడ్ కేసు నమోదైంది. 85 ఏళ్ల మహిళకు కోవిడ్ సోకినట్లు సమాచారం. శాంపిల్‌ను జీనోమ్ సీక్వెన్స్ ల్యాబ్‌కు అధికారులు పంపించారు. ఏలూరులో కరోనా మరో కేసు నమోదైంది. కొత్త వేరియంట్ నేపథ్యంలో ఆరుగురికి ర్యాండమ్ టెస్టులు చేసిన వైద్యులు.. ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజ్ వైద్యుడికి కోవిడ్ పాజిటివ్ గా నిర్ధారించారు. వేరియంట్ నిర్ధారణ కోసం శ్వాబ్‌ను హైదరాబాద్ జీనోమ్ సీక్వెన్సింగ్ ల్యాబ్‌కు వైద్యులు పంపించారు. పాజిటివ్ వ్యక్తికి ఎలాంటి లక్షణాలు లేవని, ప్రజలు ఆందోళన పడొద్దని డీఎం అండ్ హెచ్‌ఓ తెలిపారు. పాజిటివ్ వచ్చిన వ్యక్తి వేరే రాష్ట్రాలకు ఎక్కడికి వెళ్లి రాలేదని స్పష్టం చేశారు. తాజాగా హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో ఇద్దరు చిన్నారులు కరోనా బారినపడ్డారు. నాలుగైదు రోజులుగా తీవ్రమైన జ్వరం, ఊపిరి పీల్చుకోవడంలో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. 14 నెలల చిన్నారికి కరోనా సోకింది. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 19 యాక్టివ్ కేసులు ఉన్నాయి. కరోనా వ్యాప్తితో ఎంజీఎం సిబ్బంది అప్రమత్తమయ్యారు. మాస్క్ లేనిదే ఆసుపత్రిలోకి అనుమతించడం లేదు. కోవిడ్ పేషెంట్లకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. తెలంగాణలో కొత్తగా 6 కరోనా కేసులు నమోదు కాగా, ఇప్పటి వరకు 20 కేసులు నమోదయ్యాయి. 16 కేసులు హైదరాబాద్‌లోనే నమోదైనట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది.




తిరుమల: తిరుమలలో శ్రీవారి సర్వదర్శనంపై గందరగోళం నెలకొంది. శుక్రవారం టికెట్లు లేకుండా సర్వదర్శనానికి వచ్చిన భక్తులను తితిదే అధికారులు క్యూలైన్లలోకి అనుమతించడం లేదు. దీంతో ఏటీసీ వద్ద తితిదే విజిలెన్స్ సిబ్బందితో భక్తులు వాగ్వాదానికి దిగారు. శనివారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని భారీ సంఖ్యలో భక్తులు తిరుమలకు తరలివస్తున్నారు.

ఇప్పటికే వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2, నారాయణ గిరి షెడ్లు నిండిపోయి.. నారాయణగిరి అతిథి గృహం వరకు క్యూలైన్ చేరుకుంది. దీంతో వైకుంఠద్వార దర్శనానికి ఇబ్బంది కలుగుతుందని భావించి, టోకెన్లు లేని వారిని దర్శనానికి తితిదే అధికారులు నిరాకరించారు. రేపటి సర్వదర్శన టికెట్లు ఉన్న వారిని సాయంత్రం క్యూ లైన్లలోకి పంపిస్తామని తెలిపారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం టోకెన్లు లేకపోయినా సర్వదర్శనానికి అనుమతిస్తామని తితిదే తొలుత ప్రకటించింది. అయితే భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో టోకెన్లు ఉన్నవారికే దర్శనానికి అనుమతించనున్నట్లు తెలిపింది. మరోవైపు శ్రీవారి వైకుంఠ ద్వార సర్వదర్శన టోకెన్లను తితిదే పంపిణీ చేస్తోంది.

భారీ సంఖ్యలో భక్తులు పోటెత్తడంతో రాత్రి నుంచే టోకెన్లు జారీ చేయడం మొదలు పెట్టింది. మరోవైపు పలువురు న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తిరుమలకు చేరుకుంటున్నారు. వీఐపీలకు వసతి గదులు కేటాయించలేక తితిదే అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల కోసం టికెట్లను ప్రత్యేక రంగుల్లో ముద్రించారు. ఇప్పటికే రూ.300 ప్రత్యేక దర్శనం టికెట్లను తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేసింది.

# ఎంపీల మూకుమ్మడి సస్పెన్షన్లు.. జంతర్‌మంతర్ వద్ద 'ఇండియా' కూటమి నిరసన




దిల్లీ: పార్లమెంటులోకి దుండగులు చొరబడిన ఘటనపై ప్రశ్నించిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులను పెద్ద సంఖ్యలో సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ.. 'ఇండియా' కూటమి దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. దీనిలో భాగంగా శుక్రవారం దిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా విపక్ష నేతలు నిరసనలో పాల్గొన్నారు. సేవ్ డెమోక్రసీ పేరిట ఈ కార్యక్రమం చేపట్టారు. భద్రతా వైఫల్యంపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. దాంతో ఉభయ సభల కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నారంటూ సభాపతులు విపక్ష ఎంపీలపై వేటువేశారు. మొత్తం 146 మంది ఎంపీలు సస్పెండ్ అయ్యారు. ఈ మూకుమ్మడి సస్పెన్షన్లపై తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఈ క్రమంలోనే జంతర్‌మంతర్ వద్ద విపక్ష పార్టీలకు చెందిన నేతలు ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ సహా పలువురు నేతలు ఈ ఆందోళనలో భాగమయ్యారు. 'ప్రజాస్వామ్య చరిత్రలో ఎక్కడా కూడా 146 మంది ఎంపీలు సస్పెండ్ అయిన పరిస్థితులు లేవు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని ప్రజలు తెలుసుకోవాలి. దీనికి ఒక్కటే పరిష్కారం. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించి, ఇండియా కూటమిని అధికారంలోకి తేవాలి' అని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అన్నారు.

# సరైన సమయంలో ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపుతారు..



అమరావతి : మోసపు వాగ్దానాలతో వైఎస్ జగన్ ప్రజలను దగాచేశారని మాజీ మంత్రి దేవినేని ఉమ పేర్కొన్నారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ఐదేళ్లు చాలలేదనడం దిగజారుడుత నానికి పరాకాష్ట అని తెలిపారు. సరైన సమయంలోనే ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపుతారన్నారు. రాష్ట్రాన్ని ఆర్థిక సుడిగుండంలోకి నెట్టిన జగన్ హామీల అమలులోనూ విఫలమయ్యారన్నారు.

టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని దేవినేని ఉమ పేర్కొన్నారు.

# భూ హక్కు చట్టం-2023ను రద్దు చేయాలి: న్యాయవాదుల నిరసన

విజయవాడ: రాష్ట్ర భూ హక్కు చట్టం-2023ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. విజయవాడలోని జిల్లా కోర్టు వద్ద మానవహారంగా ఏర్పడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

చట్టం రూపొందించే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోలేదని న్యాయవాదులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం చెబుతున్న అప్పిలేట్ అథారిటీ ఎవరనేది చట్టంలో స్పష్టంగా నిర్వచించకపోవటం అనుమానాలకు తావిస్తోందన్నారు. జిల్లా కోర్టుల ప్రమేయం లేకుండా హైకోర్టులు కేసుల్ని తీసుకోబోవని చెప్పారు.

కానీ, తాజా చట్టంలో అలాంటి వాటికి అవకాశం కల్పించటాన్ని న్యాయవాదులు తప్పుబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



## వింక్ బ్యూటీ సమ్మోహన రూపం

వింక్ బ్యూటీ ప్రియా ప్రకాష్ వారియర్ పరిచయం అవసరం లేదు. ఈ భామకు సోషల్ మీడియాల్లో అసాధారణ ఫాలోయింగ్ ఉంది. ఇటీవల హద్దులు చెరిపేసి గ్లామరస్ ఫోటోషూట్లను షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రియా ఇటీవలి ఫోటోషూట్లు అగ్గి రాజేస్తున్నాయి. తాజాగా మరోసారి వింక్ క్వీన్ అందరినీ మైమరిపించే వేషధారణతో కనిపించింది. ప్రియా లేటెస్ట్ లుక్ వెబ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తన అందం.. మనోహరమైన రూపానికి తగ్గట్టుగా పసుపు రంగు డిజైనర్ టాప్, మ్యాచింగ్ బాటమ్ తో కనిపించింది. ప్రియా ఈ సమ్మోహన రూపం ప్రస్తుతం యువతరంలో హాట్ టాపిక్ గా మారింది. అభిమానులు ఈ ఫోటోషూట్ పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ముఖ్యంగా ప్రియా డిజైనర్ లుక్, మత్తయిన రూపానికి



ఆకర్షితులయ్యారు. ఒక నెటిజన్ ఇలా వ్రాశారు! మీరు చాలా అందంగా ఉన్నారు మై క్వీన్ “ అని ప్రశంసించాడు. చాలామంది లవ్ హార్ట్ ఈమోజీలను షేర్ చేస్తున్నారు. ప్రియా ప్రకాష్ వారియర్ నటించిన ఒరు ఆధార్ లవ్ తెలుగులో అనువాదమై విడుదలైంది. ఆ తర్వాత నితిన్ సరసనా ఈ భామ ఓ చిత్రంలో నటించింది. చివరిగా తెలుగులో త్రివిక్రమ్ శ్రీనివాస్ స్క్రీపన్ ప్లేతో సముద్రకని దర్శకత్వం వహించిన 'బ్రో' చిత్రంలో సాయిధరమ్ తేజ్ సరసన కనిపించింది. సముద్రకని దర్శకత్వం వహించిన 2021 తమిళ చిత్రం వినోదయ సితం కి అధికారిక తెలుగు రీమేక్ ఇది. ప్రియా ప్రకాష్ వారియర్ నటించిన 'యారియాన్ 2' ఇటీవల విడుదలైంది. బ్లాక్ బస్టర్ మూవీ 'బెంగుళూరు డేస్'కి హిందీ అధికారిక రీమేక్ చిత్రమిది.

**ప్రియా ప్రకాష్ వారియర్ ఎవరు? :** 12 సెప్టెంబర్ 1999న కేరళలోని పున్‌కున్నంలో జన్మించిన ప్రియా ప్రకాష్ వారియర్ భారతదేశంలోనే కాకుండా విదేశాల్లోను లక్షలాది మంది హృదయాలను గెలుచుకున్నారు. ఈజిప్ట్ – పాకిస్తాన్ వంటి దేశాలలోను అభిమానులు ఉన్నారు. ఈ బ్యూటీ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ఇన్‌స్టాగ్రమ్‌లో భారీ ఫాలోయింగ్ ని కలిగి ఉంది. ఫేస్‌బుక్‌లో 3.2 మిలియన్లకు పైగా అభిమానులను సంపాదించింది. కేవలం ఒక కనుసైగతో ఆమె ప్రపంచవ్యాప్తంగా దృష్టిని ఆకర్షించింది. ఒరు ఆధార్ లవ్ చిత్రంలో నటించాక అభిమానుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రియ త్రిసూర్‌లోని విమల కాలేజీలో బి.కామ్ చదువుకుంది.

## కృతి శెట్టి.. ఫ్లాప్స్ ఎదురైనా అక్కడ మాత్రం ఫుల్ బిజీ

బేబమ్మ అంటే చాలు.. టక్కున గుర్తొచ్చేస్తాది హీరోయిన్ కృతి శెట్టి. తొలి సినిమా ఉప్పెనతో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది ఈ అమ్మడు. తన చిరునవ్వు, అందంతో టాలీవుడ్ ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుస ఆఫర్లతో బిజీ అయిపోయింది. శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాల్లో నటించి మంచి మార్కులు కొట్టేసింది. ఆ తర్వాత మాచర్ల నియోజకవర్గం, వారియర్ సినిమాల్లో తన నటనతో ఆమె ఆకట్టుకున్నా ఆ సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఇటీవలే వచ్చిన కస్టడీ కూడా ఫ్లాప్ అయింది. దీంతో ఆమె క్రేజ్ కాస్త తగ్గింది. ప్రస్తుతం తెలుగులో ఒకే ఒక్క సినిమా చేస్తోంది. యంగ్ హీరో శర్వానంద్ తో కలిసి నటిస్తోంది. అయితే ఇన్ని ఫ్లాప్స్ ఎదురవుతున్నా కూడా అమ్మడు మరోవైపు మిగతా భాషల్లో ఆమె బిజీగా గడుపుతోంది. ప్రస్తుతం కృతి తమిళ సినీ ఇండస్ట్రీలో మంచి ఆఫర్లను అందుకుంటోంది. కోలీవుడ్ లో వరుస సినిమాలను ఓకే చేస్తోంది. తాజాగా స్టార్ డైరెక్టర్ విఘ్నేశ్ శివన్ తెరకెక్కించనున్న సిని



మాలో హీరోయిన్ గా ఛాన్స్ కొట్టేసింది. ఆ మూవీలో లవ్ టుడే హీరో ప్రదీప్ రంగనాథన్ సరసన నటించనుంది. ఈ మూవీకి లవ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్- ఎల్ ఐసీగా పేరు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. అనిరుధ్ బాణీలు అందించనుండగా.. ఎస్ జే సూర్య, యోగి బాబు కీలకపాత్రలు పోషించనున్నారట. ఈ సినిమా కన్నా ముందు జయం రవి పాన్ ఇండియా ప్రాజెక్ట్ జెనీలోనూ కృతి ఛాన్స్ కొట్టేసింది. ఈ మూవీలో లీడ్ రోల్ పోషించనుంది. కృతి శెట్టితో పాటు కల్యాణి ప్రియదర్శన్, వామిక కబీ కూడా నటిస్తున్నారు. దాదాపు రూ.100కోట్ల భారీ బడ్జెట్ తో వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై ఐసరీ గణేష్ భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. మరో స్టార్ హీరో కార్తి నటిస్తున్న వా వాతియారేలో హీరోయిన్ గా ఎంపికైంది. ఈ చిత్రాన్ని గ్రీన్స్ పతాకంపై జ్ఞాన్ వేల్ రాజా నిర్మిస్తున్నారు. కోలీవుడ్ నుంచి మంచి ఆఫర్లు అందుకుంటున్న ఈ బ్యూటీ చేతిలో ప్రస్తుతం మూడు తమిళ సినిమాలు ఉన్నాయి. వీటితోపాటు మలయాళ స్టార్ టోవినో థామస్ తీస్తున్న భారీ బడ్జెట్ 3డీ పాన్ ఇండియా చిత్రంలో మెరవనుంది. మరి ఈ సినిమాలు ఆమె కెరీర్ కు ఎంతవరకు హెల్ప్ అవుతాయో చూడాలి.




# దేవర.. సడన్ బ్రేక్




ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మూవీ దేవర. ఈ సినిమాతో జాన్వీ కపూర్ టాలీవుడ్ లోకి అడుగుపెడుతోంది. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నాడు. భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా లెవల్ లో ఈ సినిమా రెడీ అవుతోంది. కొరటాల శివ ఇప్పటి వరకు చేసిన సినిమాలకి భిన్నంగా ఓ కొత్త ప్రపంచంలోకి దేవర సినిమాతో తీసుకొని వెళ్తున్నాడు. ఇప్పటికే మూవీ కంటెంట్ ఎలా ఉండబోతోంది అనేది హింట్ ఇచ్చేశాడు. ఓ ఐలాండ్ నేపథ్యంలో ఫిక్షనల్ ప్లేస్ లో కథ మొత్తం నడుస్తుందని తెలుస్తోంది. ప్రశాంత్ నీల్ కేజీఎఫ్, సలార్ కి సృష్టించినట్లే డిఫరెంట్ ప్రపంచాన్ని కొరటాల శివ దేవర కోసం సృష్టించాడు.

ఈ సినిమా మెజారిటీ షూటింగ్ కంప్లీట్ అయిపొయింది. గ్యాప్ లేకుండా నిర్విరామంగా సినిమా షూటింగ్ చేస్తున్నారు. షెడ్యూల్ నుంచి షెడ్యూల్ కి టైం తీసుకున్న కేవలం వారం రోజులకి మించి ఎప్పుడు టైం తీసుకోలేదు. అయితే మొదటిసారి మాత్రం కొంత విరామం తీసుకుంటున్నారంట. టీం మొత్తానికి న్యూ ఇయర్ హాలిడే ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ ఫ్యామిలీతో కలిసి వెకేషన్ కి వెళు తున్నారంట. కొత్త సంవత్సర వేడుకలు కూడా అక్కడే చేసుకుంటారంట. ఈ నేపథ్యంలో దేవర షూటింగ్ నెక్స్ట్ షెడ్యూల్ కి విరామం దొరికినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రెగ్యులర్ షెడ్యూల్స్ కారణంగా టీమ్ మొత్తం భాగా అలసిపోయి ఉంటారు. వారందరికీ కొంత ఉపశమనం లభించినట్లు అయ్యింది. ఈ మూవీ షూటింగ్ జనవరిలో కంప్లీట్ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇది పూర్తయిన వెంటనే తారక్ వార్ 2 షూటింగ్ లో జాయిన్ కావాల్సి ఉంది. ఇప్పటికే ఆ సినిమా షూటింగ్ స్టార్ట్ అయ్యింది. హృతిక్ రోషన్ మీద కీలక ఎపిసోడ్స్ అన్ని చిత్రీకరిస్తున్నారు. ఎన్టీఆర్ సినిమాలో నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతున్నాడు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో వార్ 2 మూవీ తెరకెక్కుతోంది. యష్ రాజ్ ఫిలిమ్స్ భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా లెవల్ లో సినిమాని నిర్మిస్తోంది.

# 2023 రీమేక్ లకు కలిసిరాలేదు..!




2023 సినిమాల సక్సెస్ రేషియో కన్నా భారీ అంచనాలతో వచ్చి నిరాశపరిచిన సినిమాలే ఎక్కువ అని చెప్పొచ్చు. వాటిలో రీమేక్ సినిమాలు కూడా ఉన్నాయి. ఈ ఇయర్ సీనియర్ స్టార్స్ నుంచి యువ హీరోల వరకు అందరు రీమేక్ లు చేశారు. అయితే ఓటీటీ ల వల్ల ఆల్రెడీ ఒరిజినల్ వెర్షన్ చూసిన తెలుగు ఆడియన్స్ కు ఈ రీమేక్ లు అంతగా రుచించలేదు. ఒకప్పుడు పరిస్థితి వేరు కానీ ఇప్పుడు ఏ భాషలో సినిమా అయినా సరే హిట్ అయ్యింది అంటే ఓటీటీలో చూసేస్తున్నారు సినీ ప్రియులు. మళ్లీ వాటిని రీమేక్ చేయడం వల్ల ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయింది. 2023 లో రీమేక్ చేసిన సినిమాల్లో భారీ అంచనాలతో వచ్చిన నిరాశ పరిచిన సినిమా భోళా శంకర్. తమిళ సినిమా వేదాళం రీమేక్ గా తెరకెక్కిన ఈ సినిమాపై మెగా ఫ్యాన్స్ కూడా మొదటి నుంచి డౌట్ పడుతూనే ఉన్నారు. మెహర్ రమేష్ ట్రాక్ రికార్డ్ తెలిసి కూడా చిరు ఎందుకు ఈ సినిమా చేశారని సోషల్ మీడియాలో హడావుడి చేశారు. ఫైనల్ గా సినిమా రిజల్ట్ కూడా అలానే వచ్చింది. ఇక ఈ ఇయర్ రీమేక్ గా వచ్చి నిరాశ పరిచిన మరో క్రేజీ మూవీ రవితేజ రావణాసుర. బెంగాలి మూవీ విన్సీ దా రీమేక్ గా వచ్చిన రావణాసుర సినిమా సుధీర్ వర్మ డైరెక్ట్ చేశారు. కానీ సినిమా ఆశించిన స్థాయిలో ఫలితాన్ని దక్కించుకోలేదు. తమిళ సినిమా వినోదయ సీతం ని తెలుగులో బ్రో గా రీమేక్ చేశారు. పవన్ కళ్యాణ్, సాయి ధరం తేజ్ కలిసి నటించిన ఈ సినిమాను మాతృక దర్శకుడు సముద్రఖని డైరెక్ట్ చేశారు. బ్రో సినిమా కూడా పవన్ కళ్యాణ్ రేంజ్ కి తగిన రిజల్ట్ దక్కించుకోలేదు. సినిమాను పవన్ కళ్యాణ్ కేవలం 20 రోజుల్లో పూర్తి చేశారు. త్వరగా చుట్టేయడం వల్లే ఫలితం కూడా అలానే వచ్చిందని అనుకోవచ్చు. ఇక మరాఠి సినిమా నట సామ్రాట్ రీమేక్ గా కృష్ణవంశీ డైరెక్షన్ లో వచ్చిన రంగమార్తాండ సినిమా కూడా బాక్సాఫీస్ దగ్గర నిరాశపరచింది. రివ్యూస్ పాజిటివ్ గా వచ్చినా సరే ఈ సినిమాను ఆడియన్స్ పట్టించుకోలేదు. తెలుగు ప్రేక్షకులు ఒరిజినల్ కథలకే ఓటు వేస్తున్నారు. ఆల్రెడీ తీసిన సినిమాను రీమేక్ గా కాదు ఒక కొత్త కథతో వస్తేనే ఎంకరేజ్ చేస్తాం అన్నట్టుగా వాళ్ల మైండ్ సెట్ ఫిక్స్ చేసుకున్నారు. అందుకే రీమేక్ ల వల్ల దెబ్బతింటున్న హీరోలు ఇక మీదట వాటి జోలికి వెళ్లకూడదని అనుకుంటున్నారు.

## ఆ మార్ఫింగ్ వీడియో వల్ల మెంటల్ టార్చర్..!

సోషల్ మీడియాలో పెరిగిన టెక్నాలజీ ఉపయోగించుకుని ఇష్టానుసారంగా సెలబ్రిటీలను ఇబ్బందులకు గురి చేస్తున్న వారు తయారు అయ్యారు. ఫోన్స్ లో కూడా మార్ఫింగ్ వీడియోలు మరియు ఫోటోలు తయారు చేసే యాప్స్ రావడంతో అక్రమార్కులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. సెలబ్రెటీలను అసభ్యంగా మార్ఫింగ్ చేస్తూ శునకానందం కు పాల్పడుతున్నారు. టీవీ సీరియల్స్ మరియు జబర్దస్త్ ఇతర ఈటీవీ కార్యక్రమాల ద్వారా పాపులారిటీని సొంతం చేసుకున్న రీతూ చౌదరి వీడియో ఒకటి కొన్నాళ్ల క్రితం వైరల్ అయింది. ఆ వీడియో విషయం లో రీతూ మొదట లైట్ తీసుకున్నా కూడా సోషల్ మీడియాలో ఆ వీడియో ను ఇంకా కూడా కొంత మంది షేర్ చేస్తూ ఉండటంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించిన రీతూ చౌదరి తన మార్ఫింగ్ వీడియో పై ఫిర్యాదు చేసింది. ఇప్పటికే పోలీసులు కొంత మందిని అరెస్ట్ చేసినట్లుగా ఆమె పేర్కొంది. ఒక వీడియోను విడుదల చేసి ఆమె తన పరిస్థితిని మరియు తాను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు గురించి కూడా అందులో తెలియజేసింది. ఆ వీడియో లో రీతూ చౌదరి మాట్లాడుతూ..



కొన్ని నెలల క్రితం నా వీడియో అంటూ ఒక మార్ఫింగ్ వీడియోను షేర్ చేసి నన్ను ట్యాగ్ చేసి కొంత మంది సోషల్ మీడియా ద్వారా పోస్ట్ చేశారు. ఆ వీడియో తో మెంటల్ టార్చర్ అనుభవించాను. నా కుటుంబ సభ్యులు, నా బాయ్ ఫ్రెండ్ ఇంకా ఇండస్ట్రీకి చెందిన కొందరు నాకు మద్దతుగా నిలిచారు. చాలా ఆలోచించిన తర్వాత ఆ వీడియో పై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాను. నేను ఏ వీడియో పెట్టినా, పోస్ట్ పెట్టినా కూడా కొందరు తీవ్రమైన పదజాలంతో కామెంట్స్ చేస్తున్నారు. వారందరిపై కూడా కేసు పెట్టాలని నిర్ణయించుకున్నాను. నా పై అసభ్యకరంగా కామెంట్స్ చేసిన వ్యక్తి తరపు వారు చిన్న పిల్లాడు క్షమించు వదిలేయమని మాట్లాడుతున్నారు. సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా సెలబ్రిటీలను కామెంట్స్ చేసే వారిని వదిలి పెట్టాలా అంటూ రీతూ వర్మ ప్రశ్నించింది. ఇటీవల రీతూ వర్మ తన కొత్త ఇంటి గృహ ప్రవేశం చేసింది. ఆ వీడియో కు కూడా చాలా మంది అసభ్యకరంగా కామెంట్స్ చేశారట.

వారిపై కూడా ఫిర్యాదు చేస్తానంటూ రీతూ వర్మ హెచ్చరించింది. రీతూ కు మాత్రమే కాకుండా ఎంతో మంది సెలబ్రిటీలకు ఇలాంటి అనుభవమే ఎదురవుతోంది.

## ఏమి ఈ విరహా జ్వాల జానూ?

ఏమి ఈ విరహజ్వాల జానూ.. మత్తు కళ్లతో కవ్విస్తావు.. చిత్తు చిత్తు చేస్తావు. మతులు చెడి మంచమెక్కుతున్నారు యూత్. ఇంతగా యువతను దారి మళ్లిస్తున్న ఈ పాపం నీదే! ఇదిగో ఇక్కడ జాన్వీ కపూర్ లేటెస్ట్ ఫోటోషూట్ కి అంతర్జాలంలో స్పందన ఇలా ఉంది. ఘాటైన వ్యాఖ్యలతో నెటిజనులు వేడెక్కిస్తున్నారు. నిజంగానే ఇటీవల జాన్వీ కపూర్ బాడీ లాంగ్వేజ్ అమాంతం మారింది. మత్తు కళ్లతో చిత్తు చేస్తోంది. మతులు చెడే భంగిమలతో హొయలు పోతోంది. స్టైల్ ఐకాన్ గా .. రెబల్ క్వీన్ గా మైమరిపిస్తోంది. జాన్వీ కపూర్ వరుస ఫోటోషూట్లు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారుతోంది. అయితే జాన్వీకపూర్ తాజా ఫోటోషూట్ లో ట్రెడిషనల్ బ్లాక్ శారీ లుక్ లో ఎంతో అందంగా కనిపిస్తోంది. అందానికి అందం వేడెక్కించే యవ్వన శిరులు మతులు చెడగొడుతున్నాయి. అందునా మిర్రర్ సెల్ఫీతో జాన్వీ ఇంకా స్పెషల్ గా కనిపించింది. అద్దం కనిపిస్తే చాలు అమ్మాయిలు



సెల్ఫీ షూట్ లు ఫోటోషూట్లతో చెలరేగిపోతుంటారు. అలాంటిది జాన్వీ ఇలా స్పెషల్ ఫోటోషూట్ కోసం మిర్రర్ ని ఆశ్రయించింది. అద్దంలో అందగత్తె జాన్వీ ప్రతిబింబం నిజంగానే మతులు చెడగొడుతోంది. అయితే జాన్వీ ఈవిల్ ఐ నుంచి తనను తాను కాపాడుకోవాల్సి ఉంటుంది!! జాన్వీ కపూర్ టాలీవుడ్ లో ఆరంగేట్రం చేస్తున్న సంగతి తెలిసిందే. యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన జాన్వీ 'దేవర' షూటింగ్ లో పాల్గొంటోంది. ఈ సినిమాపైనే ఈ బ్యూటీ ఫోకస్ అంతా.

తన తెలుగు సినిమా డెబ్యూని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది జాన్వీ శ్రమిస్తోంది. దేవర కోసం ఇటీవల బాలీవుడ్ సినిమాలను కూడా తగ్గించుకుంది. ఇక దేవర చిత్రాన్ని కొరటాల రెండు భాగాలుగా ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే.




## ప్రజావాణి కార్యక్రమం.. గత ప్రభుత్వంలో అన్యాయం: హోంగార్డులు

హైదరాబాద్: ప్రజావాణి కార్యక్రమం శుక్రవారం ఉదయం ప్రారంభమైంది. ప్రతి మంగళ, శుక్రవారం ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రజా సమస్యలపై ధరఖాస్తులు స్వీకరించేందుకు తెలంగాణ సర్కార్ నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి భారీ స్పందన లభిస్తోంది. ప్రజా భవన్‌లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పింఛన్లు, ఇళ్లు, ఉద్యోగాలు ఇప్పించాలని పెద్ద ఎత్తున వచ్చిన జనాలు తమ సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు అందజేస్తున్నారు. హోంగార్డులకు సంబధించి 250 మంది తమ సమస్యను ప్రజా భవన్‌లో అధికారులకు విన్నవించుకునేందుకు వచ్చారు. ఈ సందర్భంగా వారు ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. 250 మంది హోంగార్డులం ఉమ్మడి రాష్ట్రంలో పదేళ్లు విధులు నిర్వహించిన తర్వాత.. తమకు ఆర్డర్ కాపీ లేదని 2011లో తీసేశారని, 2014లో తెలంగాణ రాష్ట్రం వచ్చాక తమకు న్యాయం చేయాలని తిరగ్గా.. తిరగ్గా 2018లో మమ్మల్ని విధుల్లోకి తీసుకుంటామని మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చారని, ఆ హామీ నెరవేరలేదని అన్నారు. గత ప్రభుత్వంలో అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే అందరినీ ఆదుకుంటామని గతంలో మాకు రేవంత్ రెడ్డి, సీతక్క, భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని.. ఇప్పుడు తమను విధుల్లోకి తీసుకుంటారనే నమ్మకంతో ప్రజా వాని కార్యక్రమానికి వచ్చామని హోంగార్డులు చెప్పారు.

## ప్రజల పక్షాన పోరాడుతూనే.. కలిసికట్టుగా ఎదుర్కోవాలి



హైదరాబాద్ : ప్రజల పక్షాన పోరాడుతూనే.. పార్టీలోని ప్రజాప్రతినిధులు, నేతలను సర్కార్ ఇబ్బందులకు గురిచేస్తే కలిసికట్టుగా ఎదుర్కోవాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం మొదటిసారి గ్రేటర్‌లోని కార్పొరేటర్లతో ఆయన తెలంగాణ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 'ప్రభుత్వం నుంచి మీపై కేసులు పెట్టడం, ఇతరత్రా ఇబ్బందులుంటే అందరూ సమష్టిగా పోరాడాలి. మేమూ మద్దతుగా ఉంటాం. ఎమ్మెల్యేల విషయంలోనూ పార్టీ ఇదే విధానం అవలంభిస్తుంది' అని తెలిపారు. అసెంబ్లీలో పరిణామాలు చూస్తే ఎంఐఎం కాంగ్రెస్?తో వెళ్తుందనుకోవడం లేదన్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం సోనియాగాంధీని కలిసిన విషయం.. కాంగ్రెస్ లో టీఆర్ఎస్ విలీన ప్రతిపాదన.. ఆ క్రమంలో జరిగిన పరిణామాలనూ సమావేశంలో ప్రస్తావించారు. శాసనసభా స్థానాలు పెరిగితే కొందరికి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశాలూ రావచ్చన్నారు. త్వరలోనే పార్టీ సభ్యత్వ నమోదు ఉంటుందని, కమిటీలు, పార్టీలో పదవుల విషయంపై అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అలవికాని హామీలిచ్చిందని.. నిధుల లభ్యత చూస్తే.. అవన్నీ అమలు చేసే పరిస్థితి లేదన్న విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు.

ఓటమికి అనేక కారణాలుంటాయని, మున్ముందు ఏం చేయాలి..? ఎలా ముందుకు సాగాలి..? అన్న దానిపై దృష్టి సారించాలన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం కేటీఆర్ బుజ్జగింపు ధోరణిలో మాట్లాడారని పలువురు కార్పొరేటర్లు చెప్పారు.




హైదరాబాద్: నగరంలో 2022 ఏడాదితో పోలిస్తే 2023లో క్రైమ్ రేటు 2 శాతం మేర పెరిగిందని సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో నగర వార్షిక నేర నివేదికను ఆయన విడుదల చేశారు.

ఈ ఏడాదిలో హత్యలు తగ్గి, స్థిరాస్తి సంబంధిత నేరాలు 3 శాతం మేర పెరిగాయన్నారు. "అసెంబ్లీ ఎన్నికలు సహా ఈ ఏడాది అన్ని పండుగలు, ర్యాలీలను ప్రశాంతంగా నిర్వహించాం. చాలా కాలం తర్వాత ఈ ఏడాది గణేశ్ నిమజ్జనోత్సవం, మిలాద్ ఉన్ నబీ ఒకేసారి రావడంతో మత పెద్దల సహకారంతో ప్రశాంతంగా నిర్వహించాం. ఈ ఏడాదిలో మహిళలపై నేరాలు పెరిగాయి. మహిళలపై అత్యాచార కేసులు 2022లో 343 ఉంటే.. ఈ ఏడాది 403 నమోదయ్యాయి. సైబర్ నేరాలు 11 శాతం పెరిగాయి. గతేడాది సైబర్ నేరాల్లో రూ.82 కోట్ల మోసాలు జరిగితే, ఈసారి రూ.133 కోట్లను కేటుగాళ్లు కాజేశారు. ఆర్థిక నేరాలపై 2022లో 292 కేసులు నమోదైతే.. 2023లో స్వల్పం (344)గా పెరిగాయి.

పోక్సో కేసులు 12 శాతానికి తగ్గాయి. డ్రగ్స్ నిర్మూలనకు నార్కోటిక్ బ్యూరో తీవ్రంగా కృషి చేస్తోంది. సరఫరా చేసే వాళ్లు ఎక్కడ ఉన్నా పట్టుకుంటాం. డ్రగ్స్‌ను గుర్తించేందుకు స్నిపర్ డాగ్స్‌ను వినియోగిస్తాం. సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరిస్తున్నాం" అని సీపీ వెల్లడించారు.

## 146 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం సిగ్గుచేటు: భట్టి విక్రమార్క




హైదరాబాద్: పార్లమెంటులోకి దుండగులు చొరబడిన ఘటనపై ప్రశ్నించిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులను పెద్ద సంఖ్యలో సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ.. 'ఇండియా' కూటమి దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో తెలంగాణ కాంగ్రెస్ నేతలు, ఇండియా కూటమి పక్షాల నేతలు ధర్నా చేశారు. 'సేవ్ డెమోక్రసీ' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క (%దీష్ట్రఘ్ఱ ఎఱఅఎతీఖుఝతీఏఝ%) మాట్లాడారు. "అనేకమంది త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది.

అలాంటి ఈ దేశంలో ఇప్పుడు అరాచక పాలన సాగుతోంది. పార్లమెంటులో జరిగిన అలజడిపై హోంమంత్రి అమిత్‌షా నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన రాలేదు. పార్లమెంటులో అసలు ఏమీ జరగలేదనే విధంగా ప్రధాని మోదీ, అమిత్ షా వ్యవహరిస్తున్నారు. 146 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం సిగ్గుచేటు. దేశ రక్షణను భాజపా ప్రభుత్వం గాలికొదిలేసింది. ప్రజాస్వామ్యాన్ని ప్రజలంతా కాపాడాల్సిన అవసరం ఉంది" అని భట్టి పేర్కొన్నారు.

**ప్రధాని మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి: కూనంనేని సాంబశివరావు** – పార్లమెంటు ఘటనపై ప్రశ్నిస్తే ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం దుర్మార్గమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. "ఈ ఘటనకు ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలి. దీనిపై విచారణ జరిపించాలి. భాజపా ఎంపీలు దేశం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ఘటనపై పూర్తి బాధ్యత తీసుకుంటూ ప్రధాని మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి" అని కూనంనేని డిమాండ్ చేశారు.

## కాకా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: కాకా 9వ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాగ్ లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్. అంబేద్కర్ కళాశాలలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకా వర్ధంతి సందర్భంగా వారికివే తన నివాళులన్నారు. వివేక్, వినోద్‌లను చూసినపుడు తనకు రామాయణంలో లవకుశలు గుర్తుకొస్తారన్నారు. ఎంత సంపాదించామనేది ముఖ్యం కాదని, సమాజానికి ఎంత పంచామనేది కాకా సామాజిక బాధ్యత విధానమని కొనియాడారు. గత 50 ఏళ్లుగా ఎంతో మంది విద్యార్థులను తీర్చి దిద్దిన ఘనత కాకా సొంతమన్నారు. దేశ నిర్మాణంలో కాకా తన సామాజిక బాధ్యతను నిర్వర్తించారని, ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యార్థులకు విద్యనందిస్తున్న ఘనత కాకా కుటుంబానిదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నిర్దిష్టమైన లక్ష్యాన్ని పెట్టుకుని ఆ దిశగా పనిచేస్తే ఖచ్చితంగా గమ్యాన్ని చేరొచ్చని.. తెలంగాణ ప్రజల ఆశీర్వాదం, నిరుద్యోగుల పోరాటంవల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కఠోర దీక్షతో తెలంగాణను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. డబ్బులుంటేనే రాజకీయాలు అనే ఆలోచన పక్కన పెట్టాలని.. ఇందిరమ్మ ఇంట్లో నివసించే సామాన్యుడు కూడా ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. ప్రజల్లోకి వెళ్లి ప్రజలకు సేవ చేస్తే ప్రజలు తప్పకుండా ఆదరిస్తారని, దేశంలో గాంధీ కుటుంబంలా.. రాష్ట్రంలో కాకా కుటుంబం కాంగ్రెస్‌కు అండగా ఉంటుందని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు మేము అండగా ఉంటామని ముఖ్యమంత్రి రేవంత రెడ్డి స్పష్టం చేశారు.




హైదరాబాద్: తెలంగాణలో వాహనదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పెండింగ్ చలానాలపై భారీ డిస్కౌంట్ ప్రకటించింది. టూవీలర్స్‌పై 80 శాతం, ఫోర్ వీలర్స్, ఆటోలపై 60 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. లారీలతో పాటు ఇతర భారీ వాహనాలపై పెండింగ్ చలానాలో 50 శాతం తగ్గింపు ఇచ్చింది. ఈనెల 26వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకు డిస్కౌంట్ చలానాల చెల్లింపునకు అవకాశం కల్పించారు. 2022 మార్చి 31 నాటికి రాష్ట్రంలో 2.4 కోట్ల చలానాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని తగ్గించుకోవాలన్న ఉద్దేశంతో గత ఏడాది ప్రత్యేక రాయితీ ప్రకటించారు. ద్విచక్ర వాహనాలకైతే 75 శాతం, మిగతా వాటికి 50 శాతం రాయితీ ఇచ్చారు. దీనికి అనూహ్య స్పందన వచ్చింది. కేవలం 45 రోజుల వ్యవధిలో రూ.300 కోట్ల వరకూ వసూలయ్యాయి. దాదాపు 65 శాతం చలానాలు చెల్లించారు. ఆ తర్వాత మళ్లీ పెండింగ్ భారం పెరిగిపోతోంది. గత నెలాఖరుకు చలానాల సంఖ్య మళ్లీ రెండు కోట్లకు చేరుకుందని అంచనా. ఈ నేపథ్యంలో మరోమారు రాయితీ ప్రకటించారు. నిర్ణీత వ్యవధిలో చలానాలు చెల్లించేవారికే ఈ రాయితీ వర్తిస్తుంది. మీ వాహనంపై ఎన్ని చలానాలు ఉన్నాయో ఇక్కడ క్లిక్ చేసి చెక్ చేసుకోండి. https://echallan.tspolice.gov.in/publicview/

## బీజేపీ ఫైర్ బ్రాండ్.. అలక 'రాజా'!



హైదరాబాద్ : తెలంగాణ బీజేపీలో మళ్లీ ముసలం మొదలైంది. మొన్నటిదాక అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ ను దింపేవరకు ఓ వర్గం ఊరుకోలేదు. ఆయనను పక్కనపెట్టాక.. ఎన్నికల్లో పరాజయం పాలైనా పద్ధతి మారలేదు. తాజాగా పార్టీకి చెందిన సీనియర్ ఎమ్మెల్యే అలక బూనారట. ఇప్పటికే ఫైర్ బ్రాండ్ నాయకుడిగా పేరున్న ఆయన వివాదాస్పద వ్యాఖ్యలకు గాను ఓసారి సస్పెన్షన్ వేటునూ ఎదుర్కొన్నారు. సీనియర్ నాయకులంతా ఓటమిపాలైన సందర్భంలో ఇప్పుడు ఆయనే సీనియర్ గా మిగిలారు. అయినా తనకు కీలకమైన పదవి దక్కకపోవడంతో ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం.

**ఇక్కడా రెండుగా చీలింది..** క్రమశిక్షణ గల పార్టీగా చెప్పుకొనే బీజేపీలో వర్గాలకు కొదవ లేదు. తెలంగాణలో ఇలానే తలో వైపు లాగి వెనుకబడిపోయారు. అయితే, అభ్యర్థుల మంచి పేరుతో ఇటీవల ఎన్నికల్లో 8 సీట్లు నెగ్గింది. అనూహ్యంగా సీనియర్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, దుబ్బాకలో రఘునందన్ ఓటమిపాలయ్యారు. కరీంనగర్, నిజామాబాద్ ఎంపీలుగా ఉన్న బండి సంజయ్, ధర్మపురి అర్వింద్ సైతం పరాజయం ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ శాసన సభా పక్ష నేతగా ఎవరిని ఎంపిక చేయాలనే విషయంలో రాష్ట్ర అగ్ర నాయకులు రెండుగా విడిపోయినట్లు తెలుస్తోంది.

**రాజాసింగ్ కు దక్కనట్టేనా? :** ఈసారి 8 మంది ఎమ్మెల్యేలు గెలిచిన నేపథ్యంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ పదవి అత్యంత కీలకం. ఏకైక ఎమ్మెల్యే కావడంతో 2018లో గోషా మహల్ నుంచి గెలిచిన రాజాసింగ్ కు ఆ బాధ్యతలు దక్కాయి. కానీ, ఈసారి ఆయనతో పాటు మరో ఏడుగురు నెగ్గారు. వీరిలో నిర్మల్ నుంచి మహేశ్వర్ రెడ్డి ఒకరు. గతంలోనూ ఓసారి ఈయన ఎమ్మెల్యేగా పనిచేశారు. రాజాసింగ్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే. కాగా, మహేశ్వర్ రెడ్డి కోసం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పట్టుబడుతుండగా, రాజాసింగ్ ను శాసన సభా పక్ష నేత చేయాలంటూ బండి సంజయ్ కోరుతున్నట్లు తెలుస్తోంది.

**రాజాకు పదవిస్తే తనకు దెబ్బ..** రాజాసింగ్ ను అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ చేస్తే తనకు దెబ్బ అని.. ముఖ్యంగా హైదరాబాద్ నగరంపై పట్టు పోతుందని ఓ సీనియర్ నేత భావిస్తున్నారట. అందుకే ఆయన వేరే నాయకత్వం వైపు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. ఈయనను సిటీలో అడ్డుకునేందుకే రాజాసింగ్ కు మరో నేత మద్దతు తెలుపుతున్నారని తెలుస్తోంది. కాగా, ఈ పదవిపై శాసన సభ సమావేశాలు మొదలైన దగ్గరనుంచే బీజేపీలో సంవాదం సాగుతోంది. ఈ పరిణామాల మధ్య రాజాసింగ్ అలకబూనినట్లుగా తెలుస్తోంది.

**సమావేశాలు ముగిశాక ఎల్పీ లీడర్ ఎంపిక..** బీజేపీకి శాసనసభా పక్ష నేత లేకుండానే కొత్త ప్రభుత్వంలో తెలంగాణ అసెంబ్లీ తొలి సమావేశాలు ముగిశాయి.

సమావేశాల సెషన్ గురువారంతో పూర్తయింది. దీంతో ఆ పార్టీ కొత్త శాసనసభా పక్ష నేత ఎంపిక ఎప్పుడనే ప్రశ్న వస్తోంది.




హైదరాబాద్: కరోనా మహమ్మారి మరోసారి విజృంభిస్తోంది. గురువారం హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి 'నీలోఫర్'లో 14 నెలల శిశు బాలుడికి కొవిడ్ నిర్ధారణ అయ్యింది. అయితే బాలుడి బాలుడి ఆరోగ్యం స్థిరంగానే ఉందని హాస్పిటల్ సూపరింటెండెంట్ ఉషా రాణి వెల్లడించారు. డిసెంబర్ 18న న్యూమోనియాతో చిన్నారిని హాస్పిటల్‌లో చేర్పించారని, దగ్గు, జలుబు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపించాయని ఆమె వివరించారు. అన్ని న్యూమోనియో కేసులకు కరోనా టెస్టులు చేస్తుంటామని, అదే విధంగా బాలుడికి కూడా నిర్వహించగా కొవిడ్ నిర్ధారణ అయ్యిందని చెప్పారు. బుధవారం శాంపుల్స్‌ను టెస్టింగ్‌కు పంపించగా గురువారం నిర్ణారణ అయ్యిందని వివరించారు. అయితే బాలుడి తల్లిదండ్రుల్లో కరోనా లక్షణాలులేవని పేర్కొన్నారు.

**భూపాలపల్లి మహిళకు కొవిడ్ నిర్ధారణ :** భూపాలపల్లి జిల్లాకు చెందిన గ్యాదరి యాదమ్మ (62) అనే మహిళకు కోవిడ్ – 19 పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ వెల్లడించారు. నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొత్త వేరియంట్ జెడ్ఎన్ 1 వేరియంట్ నిర్ధారణ కోసం యాదమ్మ శాంపిల్స్ పుణేకు పంపామన్నారు. ఎంజీఎంలో 50 పడకలు సిద్ధం చేశామన్నారు. ఈ వేరియంట్ చాలా ప్రమాదకరమని తెలుస్తోందని చంద్రశేఖర్ అన్నారు. కోవిడ్ కిట్లు సిద్ధం చేస్తున్నామన్నారు.

డబ్ల్యూహెచ్ఓ సూచనల ప్రకారం అంతా అప్రమత్తంగా ఉన్నామన్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దని అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నామన్నారు. అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని.. ప్రజలు గ్రూపులుగా వెళ్ళవద్దని.. మాస్కులు తప్పకుండా వాడాలని చంద్రశేఖర్ సూచించారు. కాగా కరోనా కొత్త వేరియెంట్ జేఎన్.1 దేశవ్యాప్తంగా ఆందోళనలు కలిగిస్తోంది.

కేరళలో ఇప్పటికే ఒక కేసు నమోదవ్వడంతో జేఎన్.1 వ్యాప్తిపై భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు వాతావరణంలో మార్పు కారణంగా ఫ్లూ, జ్వరం, జలుబు, వాసన లేకపోవడం వంటి లక్షణాలతో జనాలు పెద్ద సంఖ్యలో హాస్పిటల్స్‌కు క్యూ కడుతున్నారు. దీంతో కరోనా కొత్త వేరియెంట్ జేఎన్.1 వేరియంట్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు అప్రమత్తం చేస్తున్నారు.




రాజేంద్రనగర్ : పదో తరగతిలోనే నక్సలిజం వైపు ఆకర్షితురాలినై పది సంవత్సరాల పాటు అడవుల్లో తిరిగానని, చదువు విలువ తెలుసుకొని బయటకు వచ్చి ఎల్ఎల్‌బీ పూర్తిచేశానని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్(ఎన్‌వైకేఎస్) ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని సహకార నిర్వహణ సంస్థలో వారం రోజుల పాటు నిర్వహించనున్న 'ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్–2023' శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తాను మావోయిస్టుగా నిలబడ్డ కోర్టులోనే న్యాయవాదిగా గౌరవంగా కేసులు వాదించానని చెప్పుకొచ్చారు. ఆదివాసీ ప్రాంతంలో నివసించే ప్రజలు సిగ్గరులని, ఆత్మన్యూనత భావంతో ఉంటారన్నారు. ఆయా ప్రాంతాల నుంచి శిక్షణకు వచ్చిన యువత ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల సూచనలతో ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని ఉద్బోధించారు. జీవితంలో ఉన్నత స్థానం సాధించడానికి విద్య చాలా ప్రధానమైందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. తన జీవితంలో విద్య ద్వారానే అనేక మార్పులు వచ్చాయని, ఇటీవల పీహెచ్‌డీ కూడా పూర్తిచేశానని, ఇప్పటికీ తాను ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థినేనని మంత్రి అన్నారు. ఆదివాసీ యువత ఆయా రాష్ట్రాల్లో డిమాండ్ ఉన్న కోర్సుల గురించి తెలుసుకొని వాటిని అభ్యసించాలన్నారు. తెలంగాణలో అంతా తనను సీతక్కా అని అంటారని, మీకు కూడా సోదరిలా సహాయ సహకారాలు అందిస్తానని ఆమె చెప్పారు. బిహార్, ఝార?ండ్ రాష్ట్రాల్లోని ఆదివాసీ ప్రాంతాల యువత ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొంది. ఎన్‌వైకేఎస్ తెలంగాణ డైరెక్టర్ విజయారావు, హైదరాబాద్ జిల్లా యువజన అధికారి ఖుష్బూ గుప్తా తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com